



బదిలీ ఫీవర్

ఒకటి, రెండు రోజుల్లో ఉద్యోగుల బదిలీలు

- ఎమ్మెల్యేల సిఫార్సులున్న వారికే ప్రాధాన్యం
- కూటమి నాయకుల కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- కలెక్టరేట్‌కు క్యూ కడుతున్న ఉద్యోగులు

సిఫార్సు లేఖలు లేనివారి పరిస్థితి ఏమిటో..?

జిల్లాలో బదిలీల ఫీవర్ తారస్థాయికి చేరింది. ఉద్యోగులకు సంబంధించిన బదిలీలు ఈ నెలాఖరుకు పూర్తిచేయాల్సి ఉండగా, శాసనసభ్యుల సిఫార్సు లేఖల ఆధారంగానే అధికశాతం బదిలీలు ఉంటాయని అధికారులు చెబుతున్నారు. ఎమ్మెల్యేల కార్యాలయాల నుంచి వచ్చిన జాబితాలను బట్టి దాదాపు ఉద్యోగుల బదిలీలు జరుగుతాయనే ప్రచారం జరుగుతోంది. దీంతో ఉద్యోగులు అటు కూటమి నాయకుల కార్యాలయాలకు, ఇటు కలెక్టరేట్‌కు ప్రదక్షిణలు చేస్తున్నారు.

- మచిలీపట్నం, ఆంధ్రజ్యోతి

గన్నవరంలో అంతా సర్దుకోవాల్సిందే..

గన్నవరం నియోజకవర్గంలోని గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు మండలాల్లో పనిచేసే వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులందరూ ఇతర నియోజకవర్గాలకు బదిలీపై వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత వైసీపీ పాలనలో ఆ పార్టీకి, గత ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి అధికశాతం మంది వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు అనుకూలంగా వ్యవహరించారు. ఈ నేపథ్యంలో వీరంతా ప్రస్తుతం జరిగే బదిలీల్లో ఇతర నియోజకవర్గాలకు వెళ్లాల్సిందేనని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పట్టుబడుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఈ నియోజకవర్గంలో పనిచేస్తున్న వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు అదే నియోజకవర్గంలో కొనసాగాలని తెరవెనుక తమ వంతు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. అయితే, తమను అక్కడ ఉంచరనుకున్న వీరంతా రెండు మూడు రోజులుగా కలెక్టరేట్‌కు వచ్చి ఇతర ప్రాంతాలకు బదిలీ చేయాలని దరఖాస్తులు చేసుకోవడం మొదలుపెట్టారు. ఈ నియోజకవర్గంలో జగనన్న లేఅవుట్లకు భూసేకరణ పేరుచెప్పి గత ప్రభుత్వ హయాంలో వీఆర్వోలు కోట్లాది రూపాయలు కూడగట్టుకున్నారనే ఆరోపణలున్నాయి. పరిశ్రమల స్థాపనకు అనుకూలంగా ఉన్న బాపులపాడు మండలంలోని గ్రామాల్లో పనిచేసిన వీఆర్వోలు భారీగానే మూటగట్టుకున్నారు. ఈ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారాలు అధికంగా ఉండటంతో ఎవరిస్థాయిలో వారు అక్రమాలకు పాల్పడ్డారు. బాపులపాడు మండలంలో పనిచేసే ఒక వీఆర్వో తన కుటుంబ సభ్యుల్లో ఒకరి పుట్టినరోజు వేడుకలు జరిపి ఒక అధికారికి డైమండ్ నెక్లెస్‌ను బహుమానంగా ఇచ్చారనే ప్రచారం జోరుగా సాగింది. ఈ తరహా ఉద్యోగులను నియోజకవర్గం నుంచి సాగనంపాలని ఎమ్మెల్యే స్పష్టంగా చెప్పడం గమనార్హం.

బందరులో గందరగోళం

జిల్లా కేంద్రమైన మచిలీపట్నం నియోజకవర్గంలో ఉద్యోగుల బదిలీల అంశం ఇంకా కొలిక్కి రాలేదు. కూటమి నాయకుల మధ్య సమన్వయం కుదరకపోవడంతో వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శుల బదిలీలకు సంబంధించిన జాబితాల తయారీ మరింత ఆలస్యమవుతుందని ఉద్యోగులు చెప్పుకొంటున్నారు. ఐదేళ్లుగా వివాదాస్పదులుగా పేరొందిన వీఆర్వోలను నియోజకవర్గం నుంచి పంపాలని కూటమి నాయకులు పట్టుబడుతున్నారు. వీఆర్వోల బదిలీల్లో కూటమి నాయకుల మద్దతును కూడగట్టుకునేందుకు మూడు రోజుల క్రితం మచిలీపట్నంలోని ప్రముఖ హోటల్‌లో వీఆర్వోల సంఘం నాయకులు పెద్దఎత్తున పార్టీ ఏర్పాటుచేశారని రెవెన్యూ ఉద్యోగులే చెప్పుకొంటున్నారు. మచిలీపట్నం నియోజకవర్గంలో పనిచేసే వీఆర్వోలను బదిలీ చేసే అంశంపై కూటమి నాయకులు సిఫార్సు చేసిన పేర్లతో తొలిజాబితాను పంపగా, రెండో జాబితా తయారుచేసే పనిలో ఉన్నారు.

అవనిగడ్డలో ఆచీతూచి

అవనిగడ్డ నియోజకవర్గంలో ఇటీవల జరిగిన పోలీసుల బదిలీల్లో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ప్రతిపాదించిన వారిలో ఒక్కరిని మాత్రమే నియమించారు. మిగిలిన స్టేషన్‌లలో ఎమ్మెల్యే సిఫార్సు చేయని వారిని నియమించారు. దీంతో ప్రస్తుతం జరిగే బదిలీల్లో ఎక్కువమందికి సిఫార్సు లేఖలు ఇవ్వకుండా ఎమ్మెల్యే ఆచీతూచి వ్యవహరించినట్లు పార్టీ వర్గాలు చెప్పుకొంటున్నాయి. ప్రస్తుతం నియోజకవర్గంలో పనిచేస్తున్న ఉద్యోగులతోనే తనదైన శైలిలో పనిచేయించుకుంటానని బుద్ధప్రసాద్ అంటున్నారని నాయకులు చెబుతున్న మాట.

పెడనలో గలాటా

పెడన నియోజకవర్గంలో పనిచేసేందుకు కొందరు ఉద్యోగులు సిఫార్సు లేఖల కోసం వెళ్లగా, కోరుకున్న ప్రాంతాల్లో ఖాళీలు లేవని చెబుతున్నారు. అనంతరం వేరొకరికి సిఫార్సు లేఖలు ఇచ్చారని ఉద్యోగులు చెబుతున్నారు.

ఆదాయం పెంపే ధ్యేయం

వికసిత్ ఆంధ్ర ద్వారా ఆదాయార్జన

- ఐదేళ్లలో 15 శాతం పెంచడమే లక్ష్యం
- రైతులతో మాట్లాడి ప్రణాళికలు
- అనంతరం ప్రభుత్వానికి నివేదిక
- అవనిగడ్డలో వికసిత్ ఆంధ్రప్రదేశ్ విజన్ డాక్యుమెంట్ రూపకల్పనలో కలెక్టర్ బాలాజీ
- మోపిదేవి జడ్పీ పాఠశాల ఆకస్మిక తనిఖీ

6లో..



మోపిదేవి జడ్పీ పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న కలెక్టర్ బాలాజీ

మ్యూటేషన్ మాయ

గుడివాడ మునిసిపాలిటీని కుదిపేస్తున్న భారీ కుంభకోణం

వైసీపీ హయాంలో పక్కదారి పట్టిన మ్యూటేషన్ సొమ్ము

- రూ.కోట్లలో దిగమింగిన అధికారులు
- కిందిస్థాయి నుంచి ఉన్నతాధికారి వరకూ అరాచకాలు
- విచారణకు ఆదేశించిన మునిసిపల్ ఆర్డీ
- నివేదికను తొక్కిపెడుతున్న అధికారగణం

మ్యూటేషన్ అవినీతి గుడివాడ మునిసిపాలిటీని కుదిపేస్తోంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన 143 మ్యూటేషన్ల విషయంలో కోట్లాది రూపాయల గోల్‌మాల్ జరిగినట్టు తేల్చిన మునిసిపల్ ఆర్డీ నరసింహారావు విచారణకు ఆదేశించడంతో అవినీతి పాములు పుట్టలో నుంచి బయటకొస్తున్నాయి. మ్యూటేషన్ ఫీజులను మునిసిపాలిటీకి చెల్లించకుండా కొన్ని ఆస్తి పేర్లను మార్పు చేయడం, మునిసిపల్ రెవెన్యూ అధికారులు అర్ధరాత్రుళ్లు ఈ తతంగాన్ని నడపడం, భవన విలువలో ఒక్క శాతం మొత్తాన్ని దరఖాస్తుదారుడి నుంచి నొక్కేసి అక్రమంగా పేర్లను ట్యాంపరింగ్ చేయడం చేశారు. వాటాల పంపకంలో తేడా రావడంతోనే ఈ వ్యవహారం బయటకు రాగా, ఒక్క ఏడాదిలోనే ఇంత మొత్తం అవినీతి చేసుకుంటే, వైసీపీ ఐదేళ్ల పాలనలో ఎంతమేర నిధులు గోల్‌మాల్ జరిగాయోననే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.



గుడివాడ మునిసిపల్ కార్యాలయం

గుడివాడ : స్థానిక ఏలూరు రోడ్డు, బస్టాండ్ సెంటర్, మెయిన్ రోడ్డులోని భారీ భవన సముదాయాలు, వ్యాపార భవనాలు, ప్రైవేట్ ఆసుపత్రుల పేర్లను కొందరు మున్సిపల్ రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్‌లో ట్యాంపరింగ్ చేశారు. కోట్ల రూపాయల విలువ చేసే భవనాల పేర్లు మార్చే క్రమం (మ్యూటేషన్)లో దరఖాస్తుదారుల నుంచి రూ.లక్షలు పిండుకున్నారు. వాటిని మునిసిపాలిటీలో జమ చేయకుండా పక్కదారి పట్టించి జేబులు నింపుకొన్నారు. ఈ విషయాన్ని గత ఏప్రిల్ 2న 'ఆంధ్రజ్యోతి'లో 'మ్యూటేషన్ పేరుతో మింగేశారు' శీర్షికన కథనం ప్రచురితం కాగా, వాస్తవాలను గ్రహించిన మున్సిపల్ ఆర్డీ నరసింహారావు విచారణకు ఆదేశించారు. ఈ కుంభకోణంలో కిందిస్థాయి నుంచి ఉన్నతాధికారి వరకూ అందరూ పాత్రధారులేననే ఆరోపణలు వస్తున్నాయి. అయితే, ఈ కథనంతో దరఖాస్తుదారులు ఉలిక్కిపడ్డారు. తాము నగదు చెల్లించినట్టు రశీదులు కావాలంటూ మునిసిపల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు.

సూత్రధారులు వీరే..

మునిసిపల్ రెవెన్యూ అధికారి, ఇద్దరు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, కార్యాలయంలోని సంబంధిత ఉద్యోగి, పైరవీల ఉద్యోగి, కంప్యూటర్ ఆపరేటర్లే ఈ కుంభకోణంలో సూత్రధారులుగా ఉన్నారు. ఈ విషయాన్ని మునిసిపల్ ఉన్నతాధికారులు గుర్తించారు. కాజేసిన సొమ్ము వాటాల పంపకమంతా గూగుల్ పే, ఫోన్ పే ద్వారానే జరిగినట్టు సమాచారం. పాత మునిసిపల్ కమిషనర్ ఐడీ, పాస్‌వర్డ్ లాగిన్‌తోనే ఎక్కువగా మ్యూటేషన్లు చేశారని గుర్తించారు. ఐదేళ్లలో వందల సంఖ్యలో మ్యూటేషన్లు జరిగాయి. వైసీపీ నాయకుల ప్రోద్బలంతోనే ఈ ఆన్‌లైన్ ట్యాంపరింగ్‌కు పాల్పడ్డారు.

చర్యలేవీ..?

ఇంత పెద్ద కుంభకోణం జరిగినా ఒక్క మునిసిపల్ అధికారిపై కూడా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు దారితీస్తోంది. ప్రస్తుతం కంటితుడుపుగా ఒక రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ను అంతర్గతంగా వేరే శాఖకు బదిలీ చేసి చేతులు దులుపుకొన్నారు. ఈ వ్యవహారంలో ఏ ఒక్క ఉద్యోగికీ షోకాజ్ నోటీసు కానీ, వివరణ కోరుతూ సమన్లు కానీ జారీ చేయలేదు. విచారణ నివేదికను మునిసిపల్ ఆర్డీకి పంపకుండా కావాలనే తొక్కిపెట్టారు.

మ్యూటేషన్ రిజిస్టర్ ఎక్కడ..?

మ్యూటేషన్ రిజిస్టర్ కూడా కనిపించకుండా పోయింది. ఏడాదిగా ఎటువంటి రిజిస్టర్‌ను ఇక్కడ వాడట్లేదు. దరఖాస్తుదారుడి వివరాలతో పాటు అతను చెల్లించిన నగదు వివరాలు, తేదీ, పేరు మార్పు చేసిన వివరాలను కమిషనర్ సంతకాలతో రిజిస్టర్‌లో నమోదు చేయాలి. అటువంటి రిజిస్టర్ మునిసిపాలిటీలో అందుబాటులో లేకుండా.. అధికారులే వ్యక్తిగతంగా రిజిస్టర్లను పెట్టుకున్నారనే అనుమానాలు వస్తున్నాయి. కనీసం ఎవరి ఆస్తిని ఎవరి పేరిట మార్పు చేశారో నోట్ ఫైల్స్, కార్యాలయ కాపీలు కూడా రెవెన్యూ విభాగంలో అందుబాటులో లేకపోవడం ఈ అనుమానాలకు మరింత ఊతమిస్తోంది.

విచారణ సవ్యంగా సాగేనా..?

మ్యూటేషన్‌లో జరిగిన అవినీతి నిగ్గు తేల్చేందుకు ప్రస్తుత మునిసిపల్ కమిషనర్ సకాలంలో స్పందించకపోవడంతో మునిసిపల్ ఆర్డీ సీహెచ్ నాగ నరసింహారావు రంగంలోకి దిగారు. విచారణాధికారిగా మునిసిపల్ కార్యాలయపు అకౌంట్స్ ఆఫీసర్ జీటీ నాయుడును నియమిస్తూ గత నెల 25న ఉత్తర్వులిచ్చారు. ఇదే అకౌంట్స్ అధికారిపై గతంలో వైసీపీకి చెందిన ఓ కాంట్రాక్టర్, అతని కుమారుడు దాడికి పాల్పడి, బూతుపురాణం ఎత్తుకున్న విషయం తెలిసిందే. ఒక్క ఏడాదిలో జరిగిన మ్యూటేషన్‌లలో ముగ్గురు కమిషనర్ల ప్రమేయం ఉండటంతో విచారణాధికారి వెనుకడుగు వేస్తున్నట్టు సమాచారం. పారదర్శకంగా విచారణ సాగాలంటే గుడివాడకు సంబంధం లేని మునిసిపల్ అధికారులతో విచారణ చేయించాలని, తనను తప్పించాలని జీటీ నాయుడు ఉన్నతాధికారులను కోరుతున్నట్టు సమాచారం.

అటకెక్కిన ఆటస్థలం!



- బందరులో స్టేడియం నిర్మాణానికి అవరోధాలెన్నో..
- కొల్లు రవీంద్ర క్రీడా మంత్రిగా ఉన్న సమయంలో శంకుస్థాపన
- నాశనం చేసిన వైసీపీ ప్రభుత్వం

6లో..

మచిలీపట్నంలో మూడు ఎఫ్ఎం స్టేషన్లకు అనుమతులు

6లో..

నైట్ అవుట్ వివాదం

ఆర్టీసీలో ముదురుతున్న అలవెన్సుల రగడ

- నైట్ అవుట్ అలవెన్స్ నిలిపివేతపై ఉద్యోగుల ఆగ్రహం
- వేతనంతో కలిపి చెల్లించటానికి అధికారుల నిరాకరణ
- ఆందోళన చేస్తామంటున్న ఉద్యోగ సంఘాలు
- ట్రెజరీలో మాడ్యూల్ కష్టాల వల్లే..
- మాడ్యూల్ సమస్యను పరిష్కరిస్తేనే వివాదానికి తెర

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఆర్టీసీలో నైట్ అవుట్ అలవెన్స్ రగడ ముదిరిపాకాన పడుతోంది. వేతనాలతో పాటు నైట్ అలవెన్స్ చెల్లింపులను ట్రెజరీ శాఖ నిలిపివేస్తూ ఆదేశాలివ్వడం ఉద్యోగుల్లో ఆగ్రహాన్ని తెప్పిస్తోంది. ఈ వ్యతిరేకత ఎక్కువ కావడంతో ఉద్యోగ సంఘాలు కూడా రంగంలోకి దిగాయి. గుర్తింపు సంఘాలైన ఎన్ఎంయూఏ, ఈయూ అగ్రనేతలు పీవీ రమణారెడ్డి, వై.శ్రీనివాసరావు, పలిశెట్టి దామోదరరావు తీవ్రంగా స్పందించటంతో పాటు ఆందోళనలకు సమాయత్తమవుతామని హెచ్చరిస్తున్నారు.

కొరవడిన స్పష్టత

ఆర్టీసీ ఆపరేషనల్ విభాగంలో పనిచేసే డ్రైవర్లు, కండక్టర్ల సాధారణ డ్యూటీల్లో భాగంగా నైట్ అవుట్లు మిళితమై ఉంటాయి. వేతనంతో పాటు ప్రతినెలా నైట్ అవుట్ అలవెన్సులను చెల్లిస్తారు. అయితే, ఈనెల 1 నుంచి నైట్ అవుట్ అలవెన్సులను వేతనంతో కలిపి ఇవ్వటాన్ని ట్రెజరీ అధికారులు నిలిపివేశారు. ఆర్టీసీ ఉద్యోగులు కార్పొరేషన్ పరిధిలో ఉన్నపుడు ఇండస్ట్రియల్ యాక్ట్ ప్రకారం వారికి నైట్ అవుట్ అలవెన్స్ కల్పించారు. రాత్రిపూట డ్యూటీలు చేసే వారికి రిస్క్ ఎక్కువ కాబట్టి ఇలా ఇస్తారు. ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేశాక పరిస్థితి మారింది. సాధారణ ప్రభుత్వ ఉద్యోగులకు నైట్ అలవెన్సులు ఉండవు. ఆ మాదిరిగా చేద్దాం.. అనుకున్నా ఆర్టీసీ ఇంకా పూర్తిగా ప్రభుత్వంలో విలీనం కాలేదు. కాబట్టి ఇండస్ట్రియల్ యాక్ట్ అమలు విషయంలో కొంత అస్పష్టత ఏర్పడింది. ఆర్టీసీ కార్మికుల పని విధానం అప్పుడు, ఇప్పుడు ఒకటే కాబట్టి నైట్ అవుట్ అలవెన్సుల విషయంలో న్యాయస్థానాలు కూడా స్పష్టత ఇవ్వలేదు. దీంతో ఈ అంశం అంతుచిక్కని వ్యవహారంగా మారింది.

ట్రెజరీలోనే సమస్య

ఆర్టీసీ ఉద్యోగులకు జీతాలిచ్చేది ట్రెజరీ అధికారులే. కానీ, ఆర్టీసీ.. ప్రభుత్వంలో విలీనమైనప్పటి నుంచి ఉద్యోగులు ట్రెజరీ దగ్గర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ స్థాయిలో చర్చ జరిగి, వారి సమస్యలకు పరిష్కారం ఇస్తున్నా.. క్షేత్రస్థాయిలో ట్రెజరీ అధికారులు ఆ పని చేయలేకపోతున్నారు. ట్రెజరీ మాడ్యూల్‌ను మారిస్తేనే అది సాధ్యమవుతుంది. అలాగే, విలీన సమయంలో కిందటి వైసీపీ ప్రభుత్వం ఉద్యోగులకు సంబంధించిన అనేక సంక్షేమ పథకాలను రద్దు చేసింది. కొన్నింటిని ఉద్యోగులు పోరాడి సాధించుకున్నారు. కానీ, వాటి అమలు విషయంలో సమస్య తలెత్తుతోంది. నైట్ అవుట్ అలవెన్స్ సమస్య కూడా అలాంటి వాటిలో ఒకటి. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో కూడా ఆర్టీసీ సిబ్బందికి చెల్లించే అలవెన్సులన్నింటిపైనా హామీ లభించింది. కానీ, ట్రెజరీ దగ్గరకు వచ్చేసరికి సమస్యలు పరిష్కారం కావట్లేదు.

వారసత్వ రగడ

దుర్గగుడిలో ఆరుగురు అర్చకులకు వారసత్వ గుర్తింపు

- ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా జగన్ సర్కార్ ఉత్తర్వులు
- తాజాగా వెలుగులోకి వచ్చిన వివరాలు
- అర్హతలేని వారికి అందలం.. కోర్టు కేసులున్న వారికి ప్రాధాన్యం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మిగతా అర్చకులు
- ఆదాయార్జన కోసమేనంటూ మండిపాటు



దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో వారసత్వ రగడ నడుస్తోంది. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయంలో గత మేలో హడావిడిగా పలువురు అర్చకులకు వారసత్వ హక్కులు కట్టబెట్టడం, ఈ తతంగమంతా గుట్టుగా జరగడం, అర్హతలేని వారికి వారసత్వ హక్కు కల్పించడం, కోర్టు కేసులు ఉన్నవారికి ప్రాధాన్యమివ్వడం ఇప్పుడు వివాదాస్పదమవుతోంది.

(విజయవాడ-ఆంధ్రజ్యోతి/వన్‌టౌన్) : 1987లో ఎన్టీఆర్ ప్రభుత్వం దుర్గగుడిలో వంశపారంపర్యాన్ని రద్దు చేసింది. అప్పటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఏ ఆలయాల్లోనూ వారసత్వం లేదు. 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం మళ్లీ వంశపారంపర్యానికి ఊపిరిపోసింది. దాన్ని అడ్డం పెట్టుకుని అర్హత లేని వారికి సైతం వారసత్వ హక్కులు కల్పించడం ప్రస్తుతం దుర్గగుడిలో దుమారానికి కారణమయ్యాయి. అది కూడా ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయంలో గుట్టుచప్పుడు కాకుండా ఉత్తర్వులు ఇవ్వడం చర్చనీయాంశమైంది. దుర్గగుడిలో లింగంభొట్ల దుర్గాప్రసాద్, లింగంభొట్ల వెంకట సుబ్రహ్మణ్య బద్రీనాథ్‌బాబు, కుందుర్తి వెంకట కనకసుందరశర్మ, లింగంభొట్ల వెంకట శివరామ ఫణీంద్రశర్మ, లింగంభొట్ల రఘురామశర్మ, లింగంభొట్ల భవానీప్రసాద్‌ను వారసత్వ అర్చక కుటుంబాలకు చెందిన వ్యక్తులుగా గుర్తిస్తూ గత జగన్ ప్రభుత్వంలో గుట్టుచప్పుడు కాకుండా ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ మేరకు దేవదాయ శాఖ కమిషనర్ గత మే 21న మెమో జారీ చేశారు. వారసత్వ అర్చక కుటుంబాల వారు కావడంతో దుర్గమ్మ అంతరాలయంలో మూలవిరాట్‌కు నిత్యపూజ చేయడం, శఠగోపంతో పాటు భక్తులకు కుంకుమ, ప్రసాదాలు అందజేసేందుకు వీలు కల్పిస్తూ ఈ ఉత్తర్వులు ఇచ్చారు.

వెలంపల్లి ఒత్తిడితోనేనా..?

ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయంలో ఉత్తర్వులు వెలువడటం, అర్హతలేని వారికి వారసత్వ హక్కు కల్పించడం, కోర్టు కేసులు ఉన్నవారికి వారసత్వం ఇవ్వడం ఇప్పుడు వివాదాస్పదమవుతోంది. 2024, మార్చిలో సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ ప్రకటించారు. ఎన్నికల షెడ్యూలు ప్రకటించిన వెంటనే కోడ్ అమల్లోకి వచ్చింది. ఈ సమయంలో ఎవరికి ఎటువంటి లబ్ధి చేకూర్చే పనులు కానీ, ఉత్తర్వులు జారీ చేయడం కానీ, కొత్తగా పథకాలు ప్రారంభించడం కానీ చేయకూడదు. అటువంటిది ఆరుగురు అర్చకులకు వారసత్వ హక్కులు కల్పిస్తూ ఈ ఏడాది మే 21న ఉత్తర్వులు ఇవ్వడం వెనుక దేవదాయ శాఖ మాజీమంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు ఒత్తిడి ఉందన్న ప్రచారం జరుగుతోంది. అయితే, ఈ ఉత్తర్వులను గోప్యంగా ఉంచారు. తాజాగా ఇది బయటకు రావడంతో విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అడ్డగోలుగా..

వారసత్వ అర్చకుల గుర్తింపుపై 2022లో విచారణ జరిగింది. అప్పట్లో ఈవోగా ఉన్న సురేశ్ బాబు వారసత్వ అర్చకుల గుర్తింపుపై విచారణ చేశారు. ఆ తర్వాత ఆయనే ఆర్జేసీగా ఉండటంతో ఆ విచారణ నివేదికను ఓకే. చేసేశారు. నిబంధనల ప్రకారం ఇటువంటి వారసత్వ గుర్తింపు అంశాలపై తొలుత ఈవో విచారణ జరుపుతారు. ఆ తర్వాత దేవదాయ శాఖ సహాయ కమిషనర్, డిప్యూటీ కమిషనర్, ఆర్జేసీ, దేవదాయ శాఖ హెడ్డాఫీసు నుంచి అధికారులు విచారణ జరిపి, ఈవో ఇచ్చిన నివేదికలో పొరపాట్లు ఉంటే సరిచేస్తారు. కానీ, అలా జరగలేదు. దాని ఫలితమే అర్హత లేని వారికి వారసత్వ హక్కులు కల్పించడం.

నిదర్శనాలివిగో..

- బదరీనాథ్ బాబు జీవించి ఉండగానే, ఆయన కుమారుడికి వారసత్వ హక్కు కల్పించారు. ఎవరైనా అర్చకుడు చనిపోతే వారి తరఫున ఉన్నవారికి వారసత్వ హక్కు కల్పిస్తారు. కానీ ఇక్కడ అలా జరగలేదు.
- చంద్రశేఖర్‌శర్మ ఎప్పుడో పదవీ విరమణ చేసి అన్ని ప్రయోజనాలు పొంది, పెన్షన్ తీసుకుంటూ చనిపోయారు. అయన కుమారుడు రఘురామశర్మకు వారసత్వ హక్కు కల్పించారు. అన్ని ప్రయోజనాలు పొంది పదవీ విరమణ చేసిన వ్యక్తి కుమారుడికి వారసత్వ హక్కు ఎలా కల్పించారన్నది ప్రశ్న.
- ప్రభాకరశర్మ చనిపోతే ఆయన కుమారుడు ఫణీంద్రశర్మకు 2005లో కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇచ్చారు.

- మిగతా 6లో



ఎ.కొండూరులోని డయాలసిస్ యూనిట్ పరిశీలించి, రోగులను పరామర్శిస్తున్న కలెక్టర్ సృజన

కలుషిత నీరు కబళిస్తోంది!

- భూగర్భ జలాల్లో మోటాలిక్ ఎలిమెంట్స్
- మండలంలో తాగునీరు సురక్షితం కాదు
- శ్వాశత పరిష్కారానికే కృష్ణా జలాలు
- మార్చి నాటికి పైపులైన్ పనులు పూర్తి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన

ఎ.కొండూరు, ఆగస్టు 28 : ఎ.కొండూరు మండల గ్రామాల్లో భూగర్భ జలాల్లో మెటాలిక్ ఎలిమెంట్స్ వలన తాగు నీరు కలుషితమవుతోంది.. దీనికి శాశ్వత పరిష్కారంగా కృష్ణా జలాలు పైపులైన్ ద్వారా అందజేసే ప్రాజెక్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయి.. అని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన అన్నారు. బుధవారం ఆమె మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మండలంలోని 38 కిడ్నీ ప్రభావిత గ్రామాల్లో ఎక్కువగా నీరు కలుషితం అవుతున్నట్టు పరీక్షల ద్వారా నిర్ధారణ కావడంతో సత్వరం కృష్ణా జలాలు అందజేసేందుకు ప్రభుత్వం రూ.50 కోట్లతో పైపులైన్ పనులు శరవేగంగా వచ్చే మే, జూన్ నాటికి పూర్తి చేయనున్నట్టు కలెక్టర్ తెలిపారు. తిరువూరు, గంపలగూడెం, రెడ్డిగూడెం మండలాల్లో నీటి పరీక్షలు, కిడ్నీ వ్యాధిపై సర్వే నిర్వహిస్తామని ఆమె తెలిపారు. ఎ.కొండూరు మండలంలో 216 మంది కిడ్నీ వ్యాధిగ్రస్తులు, 25 మంది డయాలసిస్ రోగులు ఉన్నారని తెలిపారు. ఎ.కొండూరు పీహెచ్‌సీలో ఉచిత డయాలసీస్ కేంద్రాన్ని పరిశీలించి రోగులకు అందుతున్న సేవలు, యూనిట్ పని తీరుపై కలెక్టర్ ఆరాతీశారు. అనంతరం దీప్లానగర్ తండాలో ప్రజల సమస్యలు, కిడ్నీ వ్యాధి పరిస్థితిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొందరికి పింఛన్ రావడం లేదని, ట్యాంకర్లతో సరఫరా చేసే కృష్ణా జలాలు సక్రమంగా రావడంలేదని కలెక్టర్‌కు వివరించారు. ప్రజలు కిడ్నీ వ్యాధి, విష జర్వాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, కాచి చల్లార్చిన నీటిని ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో తిరువూరు ఆర్డీవో కె.మాధవి, డీఎంహెచ్‌వో సుహాసిని, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ, రమణ, డ్వామా పీడీ, జె.సునీత, ఎంపీడీవో శ్రీకృష్ణ పరమత్మ, సర్పంచ్ నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.

మరో కిడ్నీ మరణం..



ఎ.కొండూరు : మండలంలోని గిరిజన తండాలో మరో కిడ్నీ మరణం నమోదైంది. వరుస మరణాలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కృష్ణారావుపాలెం శివారు గ్యామా తండాకు చెందిన అజ్మీర జామ్లా(65) గత పదేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. అయినకాడికి అప్పులు చేసి విజయవాడ, తిరువూరులోని ప్రయివేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ.. వ్యాధితీవ్రత పెరిగి మృతి చెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సీపీఎం నేతలు ఆనందరావు, వెంకటేశ్వరావు తదితరులు డిమాండ్ చేశారు.



ఆర్గానిక్ కూరగాయలు పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ

ఆదాయ అభివృద్ధే ధ్యేయం

- కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ

అవనిగడ్డ, ఆగస్టు 28 : వికసిత్ ఆంధ్రప్రదేశ్ ద్వారా రాబోయే ఐదేళ్లలో వివిధ రంగాల ద్వారా వచ్చే దిగుబడులు, ఆదాయాన్ని 15 శాతం పెంచాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ తెలిపారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకుగానూ మండలాల వారీగా వివిధ శాఖల ద్వారా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, రైతుల నుంచి అభిప్రాయాలు తీసుకుని కార్యశాలలో చర్చించిన తర్వాతే ప్రణాళికలు పూర్తిస్థాయిలో సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పిస్తామని కలెక్టర్ తెలిపారు. బుధవారం అవనిగడ్డలో వికసిత్ ఆంధ్రప్రదేశ్ విజన్ డాక్యుమెంట్ రూపకల్పన కోసం నియోజకవర్గ స్థాయిలో కార్యశాల నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ బాలాజీ, ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌తో కలిసి మండలాల వారీగా తయారు చేసిన యాక్షన్ ప్లాన్‌ను పరిశీలించారు. వ్యవసాయం, ఆక్వా రంగాల్లో పురోభివృద్ధి సాధించేటమే ధ్యేయంగా పని చేస్తామని, వ్యవసాయ, అనుబంధ రంగాలైన పశుపోషణకు కూడా తగిన ప్రోత్సాహకాలు అందిస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు.

వికసిత్ ఆంధ్రప్రదేశ్ విజన్ అభినందనీయం : బుద్ధప్రసాద్

వికసిత్ ఆంధ్రప్రదేశ్-2047 విజన్ డాక్యుమెంట్ తయారీకి ప్రభుత్వం చర్యలు తీసుకోవటం అభినందనీయమని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతా రంగాలను ముందుగా అందిపుచ్చుకోవటం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చునని తెలిపారు. ఆర్గానిక్ పంటకు మార్కెటింగ్ సౌకర్యం, సర్టిఫికేషన్ కల్పించాలని ఈ సందర్భంగా రైతులు కోరగా, కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఆక్వా సాగు అభివృద్ధి కోసం రైతులు పాత చెరువుల అభివృద్ధి, చెరువుల వద్దకు అప్రోచ్ రోడ్లు, విద్యుత్ సౌకర్యం, సబ్సిడీ విద్యుత్, ఉప్పునీటిలో పెరిగే చేపల జాతుల సాగు ప్రోత్సహించాలని కోరారు. దీనిపై మత్స్యశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని, కృష్ణా జిల్లాలో ఆక్వా సాగు గణనీయమైన వృద్ధి రేటు సాధిస్తుందని, రైతులకు సౌకర్యాలు కల్పించటం ద్వారా వారికి సాగులో లాభాలు పొందేందుకు వీలు కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో అవనిగడ్డ ఎంపీపీ తుంగల సుమతి దేవి, పీపీవో గణేష్ కృష్ణ, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, జీరో బేస్డ్ నేషనల్ ఫార్మింగ్ జిల్లా అధికారి పార్థసారధి, మార్క్‌ఫెడ్ డిఎం మురళీ కిషోర్, ఎంపిడివో మరియ దేవి, తహసీల్దార్ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలలో సాగు చేసిన కూరగాయల తోటలను పరిశీలిస్తున్న కలెక్టర్

జడ్పీ పాఠశాలలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

మోపిదేవి, ఆగస్టు 28 : కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మోపిదేవిలోని జిల్లా పరిషత్ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల, ఇంటి భోజనం తేడాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల అభిరుచులకు అనుగుణంగా నిబంధనల మేరకు భోజనం తయారుచేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పలువురు విద్యార్థులు ఇంటి నుంచి తెచ్చిన భోజనం చేస్తుండటాన్ని గమనించిన కలెక్టర్ వారిని ప్రశ్నించగా. ఆరోగ్యం బాగుండని కారణంగా కొద్ది రోజులు ఇంటి నుంచి తీసుకొస్తున్నట్టు కలెక్టర్‌కు తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులకు మధ్యాహ్న భోజన నిర్వహణపై పలు సూచనలు చేశారు.

పెరటి తోటల పెంపకంపై అవగాహన అవసరం

పెరటి తోటల పెంపకం పట్ల విద్యార్థులు మరింత అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ బాలాజీ సూచించారు. పాఠశాలలో రసాయన రహితంగా సాగుచేస్తున్న పెరటి తోటను ఉపాధ్యాయులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. తోటల నిర్వహణ తీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. రసాయన రహితంగా చేస్తున్న కూరగాయలను మధ్యాహ్న భోజనంలో వినియోగిస్తున్నట్టు ప్రిన్సిపాల్ జయంతి కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పూలు, కూరగాయలను కలెక్టర్‌కు అందజేశారు. పాఠశాలలో నైట్ వాచ్‌మెన్, స్వీపర్, ఆయాలకు ఐదు నెలలుగా వేతనాలు అందటం లేదంటూ కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వెంటనే విడుదలయ్యేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఈవో తాహెరా సుల్తానా, ఏడీఏ పార్థసారధి, తహసీల్దార్ శ్రీవిద్య, ఎంఈవో విద్యాసాగర్ తదితరులు ఉన్నారు.

వారసత్వ రగడ

(5వ పేజీ తరువాయి)

అలాగే, రఘురామ్, భవానీ ఇద్దరు కూడా రెగ్యులర్ ఉద్యోగులుగా పనిచేస్తున్నారు. గతంలో వీరిని ప్రభుత్వం ఉద్యోగంలో ఉంటారా, వారసత్వంలో ఉంటారా అని అడిగితే తాము ప్రభుత్వ ఉద్యోగంలోనే ఉంటామని చెప్పి మరీ కొనసాగుతున్నారు. తాజాగా వీరిని వారసత్వంలోకి తీసుకొచ్చారు.

- 1980లో లింగంభొట్ల బదరీనాథ్‌బాబు వంశపారంపర్య అర్చకుడిగా చేరారు. ఆయన కుమారుడు భవానీ ప్రసాద్ 2009లో సహాయకుడిగా చేరి రెగ్యులర్ అయ్యారు. దుర్గగుడి ఈవోగా సూర్యకుమారి ఉన్న సమయంలో జరిగిన తాంత్రిక పూజల్లో బదరీనాథ్, ఆయన కుమారుడు భవానీ, ఫణీంద్ర పాల్గొన్నారనే ఆరోపణలు ఉన్నాయి. వీరు మాంసం, మద్యం అమ్మవారికి నివేదన చేసినట్టుగా కూడా ఆరోపణలు వచ్చాయి. ఈ విషయంలో బదరీనాథ్ బాబును సస్పెండ్ చేశారు. మిగతా ఇద్దరికి డ్యూటీలు మార్చారు. బదరీనాథ్‌బాబు కోర్టు నుంచి ఉత్తర్వులు తెచ్చుకుని కొనసాగుతున్నారు. అయితే, ఈ కేసు ఇంకా పూర్తి కాలేదు. దోషులని తేలితే రెండేళ్ల జైలుశిక్ష పడే అవకాశం ఉంది. కేసు నడుస్తున్న సమయంలో వారిని వంశపారంపర్య అర్చకులుగా ఎలా గుర్తిస్తారంటూ పలువురు అర్చకులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. అంతరాలయంలో పూజలు, తదితరాలు నిర్వహించేందుకు భవానీప్రసాద్, ఫణీంద్ర, రఘురామ్‌కు అవగాహన లేదన్నది పలువురు అర్చకుల వాదన. ఇంకొకవైపు అంతరాలయంలో అనేక కార్యక్రమాలున్నా.. వారసత్వ అర్చకులుగా వచ్చినవారు కేవలం పాదుకలు, కుంకుమ మాత్రమే ఇస్తామని చెప్పడంపైనా మిగిలిన అర్చకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆదాయార్జన కోసమే వారంతా వారసత్వ అర్చకులుగా గుర్తింపు తెచ్చుకున్నారని విమర్శిస్తున్నారు.

రాజకీయ క్రీనీడ



స్టేడియంకు కేటాయించిన స్థలం ఇదే.. శిలాఫలకం (ఇన్‌సెట్‌లో)

- పాలకుల నిర్లక్ష్యంతో అటకెక్కిన ఆటస్థలం!
- బందరులో స్టేడియం నిర్మాణానికి అవరోధాలెన్నో..
- కొల్లు రవీంద్ర క్రీడా మంత్రిగా ఉన్న సమయంలో శంకుస్థాపన
- స్టేడియం స్థలాన్ని ఇతర అవసరాలకు మళ్లించిన వైసీపీ
- జిల్లా క్రీడాకారులకు కొరవడిన శిక్షణ

నేడు జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా..

(మచిలీపట్నం టౌన్)

2018 సంవత్సరంలో కొల్లు రవీంద్ర క్రీడాశాఖా మంత్రిగా ఉన్న సమయంలో గో సంఘం వద్ద రెండెకరాల స్థలంలో రూ. 13 కోట్ల వ్యయంతో 2018 జులై 24న స్టేడియం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం, ఈతకొలను నిర్మించేందుకు గాను భారత క్రికెట్ జట్టు అప్పటి సారధి పద్మశ్రీ అనిల్ కుంబ్లేను తీసుకువచ్చారు. శంకుస్థాపనతో మచిలీపట్నంలో ఇండోర్ స్టేడియం వస్తుందని క్రీడాకారులు ఆశించారు.

వైసీపీ పాలనలో అకకెక్కిన ఆటస్థలం

ఐదేళ్ల పాలనలో వైసీపీ ప్రభుత్వం ఇండోర్ స్టేడియం నిర్మాణాన్ని అటకెక్కించింది. అంతే

> ప్రముఖ క్రీడాకారుడు పద్మశ్రీ సీకే నాయుడు పుట్టిన గడ్డపై క్రీడాకారులకు సరైన ప్రోత్సాహం లేకుండా పోయింది. విద్యతో పాటు యువత క్రీడలకు ప్రాధాన్యం ఇస్తున్నప్పటికీ జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో స్టేడియం లేక క్రీడాకారులు ఆశించిన స్థాయికి ఎదగలేకపోతున్నారు. మచిలీపట్నంలో స్టేడియం నిర్మించాలన్న క్రీడాకారుల ఆశ అడియాశవుతూనే ఉంది.

కాకుండా ఆ స్థలంలో కొంత భాగాన్ని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ వంటి ఇతర ప్రయోజనాల కోసం కేటాయించింది. మరికొంత స్థలాన్ని పేదల ఇళ్ల స్థలాలకు కేటాయించేందుకు ప్రతిపాదించారు. ఈ దశలో స్టేడియం నిర్మాణ పనులు ఆగిపోయాయి. కొల్లు రవీంద్ర కేటాయించిన భూమి తరిగిపోయింది. ఈ నేపథ్యంలో మళ్లీ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన కొల్లు రవీంద్ర దృష్టికి క్రీడాకారులు, యోగసాధకులు స్టేడియం నిర్మాణం విషయం తెచ్చారు. జిల్లా కలెక్టర్ బాలాజీతో దీనిపై చర్చించారు. కలెక్టర్ స్పందించి జాయింట్ కలెక్టర్‌తో విచారణ జరిపించాలని సూచించారు.

అరకొర పనులతో సరి..

రెవెన్యూ కళ్యాణ మండపానికి దగ్గరలో రెండెకరాల స్థలంలో వైసీపీ ప్రభుత్వం రూ. 2 కోట్లతో ఇండోర్ స్టేడియం నిర్మాణం చేపట్టింది. కోడ్ వస్తుందని ఆదరాబాదరగా ప్రారంభించారు. కాంట్రాక్టర్‌కు కేవలం రూ.85 లక్షలు మాత్రమే ఇచ్చారు. షటిల్ కోర్టులు నాణ్యతా ప్రమాణాలు లేకపోవడంతో బీటలు వారుతున్నాయి. క్రీడా ప్రాంగణం వర్షం వస్తే ముంపునకు గురవుతోంది.

ఆటగాళ్ల ఆశలు చిగురించేనా..

నూతనంగా వైసీపీ ప్రభుత్వంలో నిర్మించిన ఇండోర్ స్టేడియంను జాయింట్ కలెక్టర్ సందర్శించారు. నివేదికను కలెక్టర్ బాలాజీకి అందచేశారు. కొల్లు రవీంద్ర తిరిగి మంత్రి అయిన కొద్ది రోజుల్లోనే క్రీడా ప్రాంగణాలపై దృష్టి సారించడంతో క్రీడాకారులు ఆశయాలు నెరవేరతాయని ఆశిస్తున్నారు. స్పోర్ట్స్ అకాడమీ సాయంతో మచిలీపట్నం, నాగాయలంకలో క్రీడా సముదాయాలు నిర్మిస్తే క్రీడాకారులు ఆశించిన విధంగా చేయూతలభిస్తుంది. ఇందుకు మంత్రి రవీంద్రతో పాటు ఎంపీ వల్లభనేని బాలశౌరి, కలెక్టర్ బాలాజీలు దృష్టి సారించాల్సి ఉంది. జిల్లా పరిషత్ సెంటర్‌లోని ఈతకొలను పక్కన ఉన్న క్రీడా ప్రాంగణం వర్షం వస్తే ముంపునకు గురవుతోంది. ఈ క్రీడా ప్రాంగణాన్ని మెరక చేయాల్సి ఉంది. క్రీడాకారులకు కావలసిన పరికరాలను కొనుగోలు చేయవలసి ఉంది. కోచ్‌ల సాయంతో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు పంపుతూ క్రీడాకారులను ప్రోత్సహించవలసి ఉంది.

క్రీడాకారుల స్టేడియం కల కార్యరూపం దాల్చాలి



- తోట అజయ్‌కుమార్
వ్యాయామ ఉపాధ్యాయుల సంఘ నాయకుడు

మచిలీపట్నంలో స్టేడియం ఏర్పాటు చేయాలని చాలా కాలంగా వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు, క్రీడాభిమానులు కోరుతూనే ఉన్నారు. క్రీడల పట్ల ఆసక్తి ఉన్న కొల్లు రవీంద్ర గతంలో క్రీడాశాఖా మంత్రిగా పనిచేశారు. మచిలీపట్నంలో దాతల సహకారంతో స్టేడియం నిర్మించాలని కోరుతున్నాం. స్టేడియం నిర్మిస్తే నైపుణ్యం, ప్రతిభ గల క్రీడాకారులు ఎందరో రాణించగలుగుతారు.

హక్కుల పరిరక్షణ బాధ్యత కమిషన్‌దే

- బాలల హక్కుల కమిషన్ రాష్ట్ర సభ్యుడు జె.రాజేంద్రప్రసాద్

గవర్నర్‌పేట, ఆగస్టు 28 : సెక్స్ వర్కర్ల పిల్లల హక్కుల రక్షణ బాధ్యత రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌దేనని, వారి పిల్లలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు నివారించడం కోసం కమిషన్‌తో కలిసి ద్విముఖ వ్యూహం రూపొందించి అమలు చేస్తుందని బాలల హక్కుల కమిషన్ రాష్ట్ర సభ్యుడు జె.రాజేంద్రప్రసాద్ అన్నారు. బుధవారం ఎంజీ రోడ్డులోని హోటల్‌లో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, హెల్ప్ సంస్థ ఆధ్వర్యంలో వేశ్యవృత్తిలోని మహిళల పిల్లల విద్య, వారి దుర్భరత్వంపై నిర్వహించిన స్టడీ రిపోర్టును విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్టడీ నివేదిక ద్వారా వెలుగులోకి వచ్చిన సమస్యల ఆధారంగా తమ తల్లి వద్ద ఉంటున్న పిల్లలకు, ఇప్పుడే పుట్టిన పిల్లలకు వారిని ఉద్దేశించే కార్యక్రమాలు రూపొందించాలని, 15 సంవత్సరాలు దాటిన పిల్లలకు జీవన నైపుణ్యాలు, వృత్తి విద్యా శిక్షణ అందించి స్వతంత్రంగా బతికే వరకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించి ఉపాధి కల్పన కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. కమిషన్ సభ్యురాలు బి.పద్మావతి మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ నిర్వహిస్తున్న టార్గెట్ ఇంటర్వెన్షన్‌లో సెక్స్ వర్కర్లు, వారి పిల్లలకు కూడా విద్య, మెంటల్ హెల్త్, న్యూట్రిషన్, బాలల అభివృద్ధి అంశాలు జోడించి నూతన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. నాగార్జున యూనివర్శిటీ సోషల్ వర్క్ ప్రొఫెసర్ సరస్వతీ రాజు అయ్యర్ స్టడీ అంశాలను వివరించారు. కార్యక్రమంలో కమిషన్ సభ్యురాలు ఆదిలక్ష్మి, ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్ నోడల్ ఆఫీసర్ ఎం.సోమశేఖర్, హెల్ప్ సంస్థ కార్యదర్శి నిమ్మరాజు రామ్మోహన్, ప్రోగ్రామ్ మేనేజర్ వి.భాస్కర్ పాల్గొన్నారు.



స్టడీ రిపోర్టు విడుదల చేస్తున్న బాలల హక్కుల కమిషన్ సభ్యులు

చల్లపల్లిలో కేంద్ర బృందం పర్యటన

- జలజీవన్ మిషన్ పనుల పరిశీలన

చల్లపల్లి/అవనిగడ్డ రూరల్, ఆగస్టు 28 : జలజీవన్, స్వచ్ఛభారత్ మిషన్ పనులను పరిశీలించేందుకు కేంద్ర ప్రభుత్వం తరపున నేషనల్ వాటర్ ఎక్స్‌పర్ట్(ఎన్‌డబ్ల్యుఈ) బృంద సభ్యులు సుధీర్‌కుమార్, కె.రాఘవేంద్రరావులు అధికారుల బృందంతో కలిసి బుధవారం చల్లపల్లిలో పర్యటించారు. గ్రామంలో జలజీవన్ మిషన్ పనులను పరిశీలించారు. తాగునీటి లభ్యత, అవసరాలు, వాటర్ టెస్టింగ్, జేజేఎం పనులపై చర్చించారు. సంపద తయారీ కేంద్రంలో వర్మికంపోస్టు తయారీని పరిశీలించారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం వినియోగిస్తున్నారో లేదో పరిశీలన చేశారు. స్వచ్ఛ చల్లపల్లి ఆధ్వర్యంలో 'మన కోసం మనం' ట్రస్ట్ నిర్మించిన పబ్లిక్ టాయిలెట్స్‌ను చూశారు. భూగర్భ డ్రెయినేజీలను పరిశీలించారు. గ్రామంలో మరొక ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణం, రెండు డైరెక్ట్ పంపింగ్ హౌస్‌లు అవసరమని సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి తెలిపారు. కేంద్ర బృంద సభ్యులకు సర్పంచ్ కృష్ణకుమారి, కార్యదర్శి పి.వి.మాధవేంద్రరావులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ పి.సత్యనారాయణ, ఏఈ జగత్, జేజేఎం బృంద సభ్యులు తదితరులు పాల్గొన్నారు. మంగళాపురం గ్రామంలోనూ బృంద సభ్యులు పర్యటించగా, గ్రామంలో తాగునీటి అవసరాల కోసం కేటాయించిన చెరువు అభివృద్ధికి నిధులు కేటాయించి తగు చర్యలు తీసుకోవాలని సర్పంచ్ డొక్కు నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. మోదుమూడి గ్రామంలో బుధవారం సాయంత్రం కేంద్ర బృందం పర్యటించింది. ఈ సందర్భంగా శానిటేషన్, తాగునీటికి చర్యలు తీసుకోవాలని వారు అధికారులకు సూచించారు.



చల్లపల్లిలో కేంద్ర బృందానికి వివరాలు తెలియజేస్తున్న సర్పంచ్, ఈవోలు

మచిలీపట్నం-రేపల్లె రైలుమార్గంపై అధ్యయనం

- ఎంపీ వల్లభనేని బాలశౌరి

మచిలీపట్నం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : ఎంతోకాలంగా జిల్లాప్రజల చిరకాల కోరికగా ఉన్న మచిలీపట్నం-రేపల్లె మధ్య రైలుమార్గం నిర్మాణంపై అధ్యయనం చేయనున్నట్టు కేంద్ర రైల్వేశాఖమంత్రి అశ్వినీవైష్ణవ్ అంగీకరించారని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మచిలీపట్నం-రేపల్లె మధ్య నూతన రైలుమార్గం నిర్మాణం చేయాలని గతంలో పలుమార్లు రైల్వేశాఖమంత్రికి వినతి పత్రాలు అందజేసినట్టు ఎంపీ తెలిపారు. ఈనెల 26వ తేదీన కేంద్రమంత్రిని మరోసారి కలిసి మచిలీపట్నం-రేపల్లె మధ్య రైలుమార్గం నిర్మాణం చేస్తే ఒనగూరే ప్రయోజనాలను, తీరప్రాంతం వెంబడి ఉత్పత్తి అయ్యే రొయ్యలు, చేపలను ఇతర రాష్ట్రాలకు తక్కువ ఖర్చుతో, తక్కువ సమయంలో ఎగుమతులు చేసే అవకాశం ఉందని వివరించడం జరిగిందన్నారు. బందరుపోర్టు నిర్మాణం పూర్తయితే వివిధ ప్రాంతాలకు సరుకుల ఎగుమతులను తక్కువ ఖర్చుతో చేసేందుకు అవకాశం ఉందని కూడా తెలియజేసినట్టు ఎంపీ తెలిపారు. ఈ నేపథ్యంలో కేంద్ర రైల్వేశాఖమంత్రి కార్యాలయం నుంచి రైలుమార్గం నిర్మాణం కోసం అవసరమైన వనరులను సమకూరుస్తామని లేఖరాసినట్టు ఎంపీ తెలిపారు.

ఎంపీపీపై రాజీనామాకు ఒత్తిడి!

- కుదరదని తేల్చి చెప్పిన ఎంపీపీ
- మండల వైసీపీ నేతల అవాక్కు..



పదవీకాలం పూర్తయిన రాజామణి



పదవి కోసం చూస్తున్న మధుబాబు

తోట్లవల్లూరు : పదవికి రాజీనామా చేయాలని ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణిని మండల వైసీపీ నేతలు ఒత్తిడి చేయడం స్థానికంగా చర్చనీయాంశమైంది. మండల పరిషత్ కార్యాలయంలో జడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్ రెడ్డి, వైసీపీ రాష్ట్ర ఎస్సీ విభాగం ప్రధాన కార్యదర్శి నడకుదురు రాజేంద్ర బుధవారం ఎంపీపీ రాజామణితో సమావేశమయ్యారు. రాజీనామా చేస్తే మిగతా పదవీ కాలాన్ని పెనమకూరు ఎంపీటీసీ సభ్యుడు మరీదు శివ మధుబాబుకి ఇస్తామని రాజామణికి వారు చెప్పారు. నేతల ప్రతిపాదనను ఎంపీపీ తిరస్కరించారు. 2021లో పదవి ఇచ్చేటప్పుడు పెట్టిన షరతుకు కట్టుబడాలని రామ్మోహన్‌రెడ్డి ఎంపీపీకి సూచించారు. అయినా ఎంపీపీ అంగీకరించకపోవటంతో వైసీపీ నేతల గొంతులో వెలక్కాయ పడ్డట్టయింది. ఏంచేయాలో తెలియక మరొకసారి ఆలోచించుకుని చెప్పమని నేతలిద్దరు వెళ్లిపోయారు. తోట్లవల్లూరు ఎంపీపీ పదవి జనరల్ కేటగిరి(ఓసీ)కి రిజర్వు అయింది. అయితే నాటి ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఓసీలను పక్కనపెట్టి గరికపర్రుకు చెందిన నడకుదురు రాజేంద్ర(ఎస్సీ)ను ఎంపీపీ అభ్యర్థిగా ప్రకటించారు. ఆ ఎన్నికల్లో రాజేంద్ర ఎంపీటీసీగా ఓటమి చెందారు. అయినప్పటికీ రాజేంద్ర చక్రం తిప్పి కైలే అనిల్‌కుమార్‌ని ఒప్పించి నార్తువల్లూరు ఎంపీటీసీగా గెలుపొందిన ఈడ్పుగంటి రాజామణి(ఎస్సీ)కి ఎంపీపీ పదవిని ఇచ్చారు. అయితే రాజామణి పదవి చేపట్టి రెండున్నరేళ్లు పూర్తవటంతో నాటి ఒప్పందం ప్రకారం బీసీనైన తనకు ఎంపీపీ పదవి ఇవ్వాలని మరీదు శివ మధుబాబు నేతలపై తీవ్ర వత్తిడి తెస్తున్నట్టు సమాచారం. కాని నేతల ప్రయత్నాలు ఫలించే అవకాశం లేదు. ఎంపీపీ పదవి అంశం మండల వైసీపీలో ఎలాంటి మలుపు తిరుగుతుందో వేచి చూడాలి.


మచిలీపట్నంలో మూడు ఎఫ్ఎం స్టేషన్లకు అనుమతులు

మచిలీపట్నం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో ప్రైవేటుగా మూడు ఎఫ్ఎం రేడియోకేంద్రాలను ఏర్పాటు చేసేందుకు కేంద్రప్రభుత్వం అనుమతులు మజూరుచేసింది. ప్రధాన మంత్రి మోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన జరిగిన కేబినెట్ సమావేశంలో ఈమేరకు నిర్ణయం తీసుకున్నారు. పట్టణప్రాంతాలలో మాతృభాషలో నడిచే ఎఫ్ఎం రేడియోకేంద్రాలను వేలంపాట ద్వారా కేటాయించనున్నారు. ఎఫ్ఎం రేడియో కేంద్రాలద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించే ఉద్దేశంతో వీటికి అనుమతులు ఇచ్చినట్టు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఇప్పటివరకు ఉమ్మడి జిల్లాలో విజయవాడలోనే ఎఫ్ఎం రేడియో కేంద్రం ఉంది. ఒకే విడతలో మచిలీపట్నంలో ప్రైవేటుగా మూడు ఎఫ్ఎం రేడియోకేంద్రాలను ఏర్పాటుచేసేందుకు కేంద్రప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది.

నగరంలో జాబ్‌మేళా రేపు

వన్‌టౌన్, ఆగస్టు 28 : హెచ్‌సీఎల్ ఆధ్వర్యంలో ఈనెల 30న శుక్రవారం నగరంలో నిరుద్యోగ యువతకు జాబ్ మేళాను నిర్వహించనున్నట్టు ముస్లిం మైనార్టీ నేత ఫారూక్ షుబ్లీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల సమయంలో నారా లోకేశ్ నిరుద్యోగ యువతకు ఉద్యోగాలను కల్పిస్తామని చెప్పారన్నారు. ఈ క్రమంలో హెచ్‌సీఎల్ జాబ్‌మేళాను యువత సద్వినియోగ పరచుకోవాలన్నారు. నాన్ ఎంపీసీ ఇంటర్ పూర్తి చేసుకుని 75 శాతం మార్కులు సాధించిన వారికి వెంటనే నియామకాలు అందజేస్తారని తెలిపారు. ప్రైవేట్ సంస్థల్లో కూడా ఉద్యోగావకాశాలున్నాయని తెలిపారు.

టిప్పర్ ఢీకొని యువతి మృతి



ఇబ్రహీంపట్నం: విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై గుంటుపల్లి డాన్‌బోస్కో స్కూల్ ఎదుట స్కూటీని టిప్పర్ ఢీ కొన్న ఘటనలో స్కూటీపై వెళుతున్న యువతి అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం.. గుంటుపల్లి గ్రామానికి చెందిన మామిళ్ల జోషిత (22) విజయవాడ నలందలో ఫైనల్ ఇయర్ డిగ్రీ చదువుతోంది. బుధవారం రాత్రి ఇబ్రహీంపట్నం వైపు స్కూటీపై వెళుతున్న ఆమెను వెనుక నుంచి వస్తున్న టిప్పర్ ఢీ కొట్టడంతో తలకు తీవ్ర గాయమైన అక్కడికక్కడే మృతి చెందింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తోబుట్టువుపై గొడ్డలితో దాడి

ఇబ్రహీంపట్నం : చెల్లిపై మద్యం మత్తులో అన్న దాడికి పాల్పడిన ఘటన బుధవారం కొండపల్లిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఖిల్లా రోడ్డు సెంటర్ సమీపంలో స్వర్గం ఫ్యామిలీ రెస్టారెంట్ పక్కనే వెంకట్రావ్, నాగమల్లేశ్వరి అన్నా, చెల్లెళ్లు సొంతింటిలో వేరు వేరు గదుల్లో ఉంటున్నారు. వివాహం కాని చెల్లిని ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోవాలని అన్న పలుమార్లు గొడవ పడేవాడు. ఈ క్రమంలో ఫూటుగా మద్యం సేవించి వచ్చి చెల్లితో గొడవకు దిగి విచక్షణా రహితంగా గొడ్డలితో ఆమె వీపుపై నరికాడు. తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఆమెను విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్సై ఎస్.పాపారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	109, 118, 129
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.20

గణేశ్ ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి

హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 28 : వినాయక చవితి ఉత్సవ పందిళ్లు నిర్వహించే వారు విధిగా అన్ని అనుమతులు తీసుకోవడంతో పాటు శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా జరుపుకో వాలని సీఐ కెవీవీ.ఎన్. సత్యనారాయణ తెలిపారు. బుధవారం స్థానిక పీఎస్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉత్సవ నిర్వహణలో ప్రారంభం నుంచి నిమజ్జనం వరకు అన్ని శాఖల అనుమతులు తీసుకోవాలని తెలిపారు. ఉత్సవ పందిరిలో అసభ్యకరమైన, వివాదస్పమైన పాటలు, నృత్యాలు ప్రదర్శించకూడదని హెచ్చరించారు. ఫ్లెక్సీపై ఇత రులను కించపరిచే విధంగా రాతలు ఉండకూడదని తెలిపారు. మైకు అనుమతి తప్పనిసరిగా ఉండాలన్నారు. నిమజ్జనం రోజున అన్ని జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు ఆ రోజు నిమజ్జనం ఎక్కడ చేస్తున్నది పోలీసు వారికి సమాచారం ఇవ్వాలని సీఐ విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఎస్సై జనార్దన్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ అస్తవ్యస్తం!

- ఉయ్యూరు ప్రధాన రహదారిపై ఆటోలు, ద్విచక్ర వాహనాలు ఎక్కడపడితే అక్కడ నిలపడంతో పెరిగిపోతున్న ట్రాఫిక్
- ఇబ్బంది పడుతున్న పాదచారులు, వాహనదారులు
- చూసి చూడనట్టు వ్యవహరిస్తున్న పోలీసులు



ఉయ్యూరు సెంటర్‌లో సర్కిల్ వద్ద నిలిచిపోయిన ట్రాఫిక్

ఉయ్యూరు, ఆగస్టు 28 : ఉయ్యూరు రోడ్లపై ట్రాఫిక్ సమస్య నానాటికి పెరుగుతున్న నేపథ్యంలో వాహనాలు నడిపేవారు, పాదాచారులకు తీవ్ర అసౌకర్యం కలుగుతుంది. పట్టణంలో ప్రధాన రహదారిపై మార్కెట్ సెంటర్, కాటూరు రోడ్డు, శివాలయం రోడ్డు, విజయవాడ రోడ్డు, మార్కెట్ సెంటర్, బస్‌స్టాండ్ రోడ్డులో అనునిత్యం ట్రాఫిక్ నిలిచిపోయి రోడ్లపై వెళ్లేవారు ఇబ్బంది పడుతున్నారు. విజయవాడ బస్‌స్టాప్ వద్ద ఆటోలు, ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాలు నిలపడంతో బస్సులు సర్కిల్ వద్ద ఆగి ప్రయాణికులను దించి, ఎక్కించుకోవడంతో వెనుక పూలకొట్లవైపు, శివాలయం రోడ్డువైపు వాహనాలు నిలిచిపోతున్నాయి. దీంతో ట్రాఫిక్ సమస్య తలెత్తి నడిచేందుకు సైతం వీలు లేక పాదాచారులకు అసౌకర్యం కలుగుతుంది. పామర్రు వైపు వెళ్లే రోడ్డు మధ్యలో పామర్రు, వీరంకిలాకు వైపు వేళ్లే ఆటోలు ఎక్కడపడితే అక్కడ నిలిపి ప్రయాణికుల కోసం ఎదురుచూడడంతో అటువైపు వచ్చే వాహనాలు నిలిచిపోతున్నాయి. కాటూరు రోడ్డులో సెంట్రల్ పార్కింగ్ ఉన్నప్పటికి రోడ్డుకు రెండుపక్కల వాహనాలు నిలపడంతో బస్సులు, ఇతర వాహనాలు వెళ్లే వీలులేకుండా పోతుంది. పాత స్టేట్‌బ్యాంక్ రోడ్డు, మార్కెట్ సెంటర్ వద్ద ఆటోలు, ద్విచక్ర వాహనాలు ఎక్కడపడితే అక్కడ నిలుపుతున్నా పోలీసులు పట్టించు కోవడం లేదు. రింగ్‌సెంటర్ సర్కిల్‌వద్ద కాటూరు రోడ్డు వైపు నుంచి శివాలయం రోడ్డు వైపు వాహనాలు వెళ్లకుండా పోలీసులు బారికేడ్లు అడ్డుపెట్టడంతో ద్విచక్రవాహనాలు, కార్లు రాంగ్ రూట్‌లో వస్తున్నాయి. దీంతో ప్రమాదాలు జరుగుతున్నా పోలీసులకు చీమ కుట్టినట్టయినా లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రింగు సెంటర్ వద్ద ఉదయం, సాయంత్రం ఒకరిద్దరు పోలీసులు, రెండు మూడు గంటలు ఉండి తరువాత కన్పించకుండా పోతున్నారు. ఇప్పటికైనా సీఐ, ఎస్సైలు స్పందించి ట్రాఫిక్, వాహనాల పార్కింగ్‌పై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.



సర్కిల్ వద్ద రాంగ్‌రూట్‌లో వస్తున్న ద్విచక్రవాహనాలు



పాత స్టేట్‌బ్యాంకు రోడ్డులో నిలిచిన ట్రాఫిక్

కాలువలోకి దూసుకెళ్లిన కారు

- డ్రైవర్ అదృశ్యం • కేసు నమోదు
- గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు



గన్నవరం, ఆగస్టు 28 : విజయవాడ నుంచి కేసరపల్లి మీదుగా కంకిపాడు వైపు వెళ్తున్న కారు ఏలూరు కాలువలోకి దూసుకెళ్లింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కంకిపాడు మండలం మారేడుమాకకు చెందిన జి.రాజేష్(36) కారు నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం కిరాయి రావడంతో వెళ్లాడు. అర్ధరాత్రి విజయవాడ నుంచి వస్తూ కేసరపల్లి వైపు ఒక్కడే కారులో వెళ్తూ ఏలూరు కాలువ దగ్గరకు రాగానే కుడివైపు టైరు పగలడంతో కాలువలోకి దూసుకెళ్లింది. అయితే కుడి వైపు టైరు పగలడంతో ఎడమవైపు ఉన్న ఏలూరు కాలువలోకి ఎలా దూసుకెళ్లింది అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కారులో ఉన్న డ్రైవర్ రమేష్ కూడా కనిపించకపోవటం మిస్టరీగా మారింది. దూసుకెళ్లిన కారులో ఉన్న రమేష్ ఏమైనట్లు అని పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రమాదం జరిగిన వెంటనే అక్కడి నుంచి వెళ్లిపోయాడా లేక కాలువలో గల్లంతు అయ్యాడా అనేది తేలాల్సి ఉందని పోలీసులు చెబుతున్నారు. రమేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివప్రసాద్ తెలిపారు. ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్‌కు సమాచారం ఇచ్చామని, ఆ బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయని ఎస్సై తెలిపారు.

ఆస్ట్రోనాట్ గోపీచంద్‌కు అనుమోలు అభినందన



పెనమలూరు, ఆగస్టు 28 : అంతరిక్షయానం చేసిన తొలి ప్రైవేట్ ఆస్ట్రోనాట్‌గా నిలిచిన పోరంకి వాసి తోటకూర గోపీచంద్‌ను టీడీపీ సీనియర్ నాయకులు అనుమోలు ప్రభాకరరావు కలిసి అభినందనలు తెలిపారు. అంతరిక్ష ప్రయాణం చేసిన మొట్టమొదటి ఆస్ట్రోనాట్‌గా తోటకూర గోపీచంద్ నిలిచిన విషయం పాఠకులకు విదితమే. ఇటీవల అనుమోలు ప్రభాకరరావు ఎవరెస్టు బేస్ క్యాంపు, టాంజానియాలోని కిలిమంజారో పర్వతాలను అధిరోహించిన అనుభవాలను గోపీచంద్‌తో పంచుకున్నారు. ఇరువురూ పరస్పరం అభినందనలు తెలుపుకున్నారు.

వేలేరు - కొయ్యూరు రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



కొయ్యూరు వద్ద రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి అట్లూరి రమేష్, నాయకులు

హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 28 : వేలేరు నుంచి కొయ్యూరు వరకు నాలుగు గ్రామాలను అనుసంధానిస్తూ రూ. 25 కోట్లతో చేట్టిన రోడ్డు నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని వారం రోజుల్లో ప్రజలకు అంకితం చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు పల్లెర్లమూడి గ్రామానికి చెందిన టీడీపీ రాష్ట్ర నాయకులు అట్లూరి రమేష్ తెలిపారు. బుధవారం ఆయన ఆ ప్రాంత రైతులు, టీడీపీ నాయకులతో కొయ్యూరు వద్ద రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా రమష్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అంతర్గత రహదారుల అభివృద్ధి వేగం పుంజుకుందని గత ప్రభుత్వం రహదారులను పట్టించుకోలేదని విమర్శించారు. వేలేరు-కొయ్యూరు రహదారికి 2022లో కేంద్ర ప్రభు త్వం నిధులు మంజూరు చేసిందని రాష్ట్ర ప్రభుత్వం అలసత్వంతో పనులు ముందుకు సాగలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సహకారంతో పనులు ముమ్మరం చేసి పూర్తి చేయించడానికి అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చామని చెప్పారు.

మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి జైలు

గన్నవరం, ఆగస్టు 28 : మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక చర్చి రోడ్డులో ఉండే షేక్ జరీనా, మాబు సుభాని భార్యభర్తలు వీరి మధ్య మనస్పర్థలు రావటంతో విడివిడిగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో భర్త వేధిస్తున్నట్లుగా జరీనా విజయవాడ దిశ పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టారు. కేసును రాజీ చేసుకోమని భర్త మాబు సుభాని పలుసార్లు బెదిరించాడు. 2022 ఫిబ్రవరి చర్చి రోడ్డులోని వాటర్ ప్లాంట్ సమీపంలో ఆమెను ఆపి అసభ్యంగా ప్రవర్తించి విజయవాడలో పెట్టిన కేసు వాపస్ తీసుకోకపోతే యాసిడ్ పోసి చంపుతానని బెదిరించాడు. దీంతో జరీనా గన్నవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ముద్దాయిపై నేరం రుజువు కావటంతో ఏడాదిన్నర జైలు శిక్ష, రూ.1500 జరిమానా విధించినట్లు తెలిపారు.

వీరపనేనిగూడెం హైస్కూల్‌కు అవార్డు



క్రీడల్లో ప్రతిభ చాటిన విద్యార్థులతో హెచ్‌ఎం వెంకటేశ్వరరావు

గన్నవరం, ఆగస్టు 28 : మండలంలోని వీరపనేనిగూడెం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డు లభించినట్లు హెచ్‌ఎం వెంకటేశ్వరరావు తెలిపారు. డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ అవార్డును ప్రకటించిందని బుధవారం తెలిపారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా 2023-24 విద్యా సంవత్సరంలో పాఠశాల క్రీడల్లో తమ విద్యార్థులు ప్రతిభ కనబ రచటంతో ఈ అవార్డు లభించిందని హెచ్‌ఎం చెప్పారు. గురువారం మచిలీపట్నంలో జరిగే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ చేతుల మీదుగా అవార్డును అందజేస్తారని తెలిపారు. విద్యార్థులు క్రీడల్లో ప్రతిభచాటి అవార్డు రావడానికి కృషి చేసిన పీడీ చాగంటిపాటి బాలకృష్ణను విద్యాకమిటీ చైర్మన్ మెట్లపల్లి రారాజు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

జ్వరాలు ప్రబలకుండా చర్యలు

గన్నవరం, ఆగస్టు 28 : మండలంలోని తెంపల్లి, వీరపనేనిగూడెం గ్రామాల్లో యాంటీ లార్వా మందు పిచికారి చేసినట్లు డాక్టర్ బి.మనోహర్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాల మేరకు జ్వరాలు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా బుధవారం డ్రైనేజీల్లో యాంటీ లార్వ పెరగకుండా కంట్రోల్ చేసే మందు లార్వాక్-25తో పిచికారి చేశారు. సర్పంచ్ కొలుసు శిరీషా హెల్త్ సూపర్‌వైజర్ అంకూరి నాగమల్లేశ్వరరావు, అంకమ్మ ఏఎన్‌ఎం మంజుల, ఆశా వర్కర్‌లు దుర్గమ్మ, మేరీ, శకుంతల పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల విధానాన్ని వ్యతిరేకించాలి



గన్నవరంలో సీపీఎం నేతల నిరసన

గన్నవరం, ఆగస్టు 28 : కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ రంగంలో అమలు చేస్తున్న స్మార్ట్ మీటర్ల విధానాన్ని వ్యతిరేకించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కళ్లం వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌లో వామపక్షాల ఆధ్వర్యంలో విద్యుత్ అమరవీరుల సంస్మరణ సభ బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు కాట్రగడ్డ రామ చంద్రజోషి, అనుమోలు వెంకటేశ్వరరావు, విజయరావు, మల్లంపల్లి ఆంజనేయులు, రంగారావు, తాత బ్బాయి, ఏసుదాసు, మీరాఖాన్, కొండా వీరాస్వామి, తిరివీధి సుబ్బారావు, మిరప నాగేశ్వరరావు, సూరగాని సాంబశివరావు, పులపాక రమేష్, నల్లూరి ధర్మారావు తదితరులు పాల్గొన్నారు. **ఉయ్యూరు :** విద్యుత్ స్మార్ట్ మీటర్ల ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోసూరు శివనాగేంద్రం అన్నారు. స్థానిక శ్రామిక భవనంలో ఏర్పాటు చేసిన విద్యుత్ పోరాట అమరవీరుల చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి బి. రాజేష్, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షులు కొండలు, సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు పడాల లక్ష్మణరావు, బి. కీర్తి, వి. లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు. **కంకిపాడు :** వ్యవసాయ మీటర్లకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం తక్షణం ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పంచకర్ల రంగారావు అన్నారు. స్థానిక మండేపూడి నాగభూషణ్ రెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విద్యుత్ అమర వీరుల సంస్మరణ సభలో అయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి తాడంకి నరేష్, మండల కమిటీ సభ్యులు శివశంకర్, జి.కుమారి, జాన్‌మోజస్, వి.మరియదాసు పాల్గొన్నారు.





ఉయ్యూరులో.. కంకిపాడులో..

అభివృద్ధి, సంక్షేమం టీడీపీ ధ్యేయం



ఉప్పలూరు పాఠశాలలో మొక్కలు నాటుతున్న టీడీపీ జిల్లా కార్యదర్శి అన్నే ధనయ్య, చలసాని రాధాకృష్ణ తదితరులు

కంకిపాడు, ఆగస్టు 28 : కూల్చడం వైసీపీ ప్రభుత్వ లక్ష్యమైతే అభివృద్ధి, సంక్షేమం టీడీపీ ధ్యేయమని టీడీపీ జిల్లా కార్యదర్శి అన్నే ధనయ్య అన్నారు. మండలంలోని ఉప్పలూరులో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమం లో బుధవారం అయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధనయ్య మాట్లాడుతూ, గత ఐదేళ్ల వైసీపీ హయాంలో సీఎం పర్యటన అంటే రోడ్డుకు ఇరువైపులా ఉన్న మొక్క లు, చెట్లు నరుకుంటూ వెళ్లారన్నారు. ప్రజలు కూడా వైసీపీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు చలసాని రాధా కృష్ణ, సర్పంచ్ సలోని, మధుసూదనరావు, కొండవీటి శివయ్య, మల్లేశ్వర రావు, ఏసుబాబు, మురళి, సర్వేశ్వరరావు, ఈవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ● కోలవెన్నులో జరిగిన మొక్కలు నాటే కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు తుమ్మల జగదీష్, ఆదినారాయణ, కల్యాణి, ఇమ్మానుయేలు, లాం ప్రతాప్, సుగుణరావు, మోహన్‌కృష్ణ, బాల శేషగిరి, జనసేన పార్టీ నాయకులు అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు. ●తెన్నేరులో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఉద్దమండి కుటుంబరావు, జుజ్జవరపు నాని, యలమంద, చిలకల పూడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ● మారేడు మాకలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో కాసరనేని మురళి, వీరబాబు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా మండలంలోని ప్రొద్దుటూరు గ్రామ శివారు యార్లగడ్డ వారి గూడెంలో సర్పంచ్ నాగలక్ష్మి, టీడీపీ గ్రామ అధ్యక్షుడు పావనమూర్తి, ఈడా కోటేశ్వరరావు, నాని, ఈవో కూర్మారావు మొక్కలు నాటారు.

వీరవల్లి ఆర్వోబీ స్థల పరిశీలన



వీరవల్లి లెవల్ క్రాసింగ్ వద్ద ఆర్వోబీ నిర్మాణానికి సంబంధించి స్థల పరిశీలన చేస్తున్న అధికారులు

హనుమానజంక్షన్, ఆగస్టు 28 : తేలప్రోలు- నూజివీడు రైల్వే స్టేషన్ల మధ్య ఉన్న వీరవల్లి లెవల్ క్రాసింగ్ (గేటు నెం:331) ఆర్వోబీ నిర్మాణానికి సంబంధించి రైల్వేశాఖ, రాష్ట్ర ప్రభుత్వ వివిధ శాఖలు అధికారులు సంయుక్తంగా బుధవారం స్థల పరిశీలన చేశారు. వీరవల్లి లెవల్ క్రాసింగ్ గేటు వద్ద ఆర్వోబీ నిర్మాణ ప్రతిపాదన గత కొంత కాలంగా మరుగున పడింది. దీనిపై ఇటీవల ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఎంపీ వల్లభనేని బాలశౌరి దృష్టికి తెచ్చి పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో రైల్వే ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు రైల్వే ప్లానింగ్ డిపార్టుమెంట్ ఇంజనీర్లు, ఏపీ ట్రాన్స్‌కో, ఆర్ అండ్‌బీ అధికా రులు సంయుక్తంగా స్థల పరిశీలన చేశారు. ఆర్‌అండ్‌బీ రహదారి మీదుగా సాగే ఎలైన్‌మెంట్‌తో పాటు వీరవల్లి శాలివాహన కాలనీ మీదుగా రంగన్నగూడెం కొమ్మూరు రోడ్డు వరకు తయారు చేసిన మరో ఎలైన్‌మెంట్‌పై అధికారులు చర్చించి స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా స్థానిక టీడీపీ నాయ కులు ఆళ్ల గోపాలకృష్ణ, గుండపనేని ఉమావరప్రసాద్, కసుకుర్తి అర్జునరావు, అమృతపల్లి సూర్యనారాయణ, గుండపనేని సుబ్బారావు, పుసులూరు లక్ష్మీనారాయణ అధికారులను కలిసి త్వరతిగతిన ఎలైన్‌మెంట్ ఫైనల్ చేసి పనులు చేపట్టాలని కోరారు. స్థలపరిశీలనలో రైల్వే విభాగం ఇంజనీర్లు డి.శ్రీకాంత్, సీహెచ్. సాయికుమార్, పాండురంగారావు, ఏపీ ట్రాన్స్‌కో ఈఈ ఎస్.కోటేశ్వరరావు, డీఈఈ పీఎస్. చిట్టిబాబు, పీఆర్ ఈఈ వీఎస్ స్వామి, ఆర్ అండ్‌బీ ఏఈ ఎంవీ నాగేశ్వరరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా సాయిబాబా మందిర ప్రతిష్ఠ



సాయిబాబా మందిర ప్రతిష్ఠాపన కార్యక్రమం పెనమలూరులో బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. - పెనమలూరు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



ఈడుపుగల్లు (కంకిపాడు), ఆగస్టు 28 : గ్రామాభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నామని ఈడుపుగల్లు సర్పంచ్ పందిపాటి ఇందిర అన్నారు. ఈడుపుగల్లులో రూ. 10 లక్షలతో చేపట్టిన అంతర్గత రహదారి అభివృద్ధి పనులకు బుధవారం మాజీ ఎంపీపీ దేవినేని రాజాతో కలిసి ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పందిపాటి ఇందిర మాట్లాడుతూ, మండలంలోనే ఈడుపుగల్లు గ్రామాన్ని ఆదర్శంగా గ్రామంగా తీర్చిదిద్దేందుకు మాజీ ఎంపీపీ దేవినేని రాజా విశేషంగా కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు షేక్ షకార్, ఉపసర్పంచ్ కిలారు శ్రీను, టీడీపీ జిల్లా కార్యదర్శి పందిపాటి సుధాకర్, శ్రీ హరి, చెల్లి సంగీతరావు, అనుమోలు రామకృష్ణ పాల్గొన్నారు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	109, 118, 129
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.5.20

జనసేన నాయకుడిపై దాడి అమానుషం: బూరగడ్డ వేదవ్యాస్

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 28: కంచడం గ్రామానికి చెందిన జనసేన నాయకుడు రవిపై వైసీపీ నాయకులు దాడి చేయడం అమానుషమని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్ అన్నారు. మచిలీపట్నం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రవిని బుధవారం వేదవ్యాస్ పరామర్శించారు. రవిపై దాడి చేసిన వైసీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



ప్రభుత్వాస్పత్రిలో రవిని పరామర్శిస్తున్న వేదవ్యాస్



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బ్రాహ్మణ సంఘాల నాయకులు

బ్రాహ్మణుల అభ్యున్నతి చంద్రబాబుతోనే సాధ్యం

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 28: బ్రాహ్మణుల అభ్యున్నతి ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి జిల్లా కన్వీనర్ పీవీ ఫణికుమార్ అన్నారు. బుధవారం శిడింబి అగ్రహారంలో చంద్రబాబు చిత్రపటానికి బ్రాహ్మణ సంఘాల నాయకులతో కలిసి ఆయన పాలాభిషేకం చేశారు. పేద అర్చకులకు ధూపదీప నైవేద్యాలకు ఇచ్చే రూ.5 వేలను రూ.10 వేలకు పెంచడం ముదావహమని ఫణికుమార్ అన్నారు. దేవాలయాల ఆస్తుల పరిరక్షణకు కమిటీని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. గాదె శ్రీనివాస శర్మ, వేమూరి నాగసాయిశర్మ, మోపర్తి సుబ్రహ్మణ్యం, వేమూరి బుజ్జి, చలపతిరావు, జి సత్యనారాయణశర్మ పాల్గొన్నారు.

మండలికి బ్రాహ్మణ నేతల సత్కారం

అవనిగడ్డ: అర్చకుల వేతనాలు, దేవాలయాల్లో ధూపదీప నైవేద్యాలకు ఇచ్చే మొత్తాన్ని పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవటంపై రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన రాష్ట్ర అధికార ప్రతినిధి టి.వి.ఫణికుమార్ హర్షం వ్యక్తం చేశారు. అందుకు సహకరించిన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌ను బ్రాహ్మణ నాయకులతో కలిసి అవనిగడ్డలో ఘనంగా సత్కరించారు. బ్రాహ్మణులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని బుద్ధప్రసాద్ హామీ ఇచ్చారు. గాదె శ్రీనివాస శర్మ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌కు అభినందన

అవనిగడ్డ, ఆగస్టు 28: తెలుగు భాషాభివృద్ధికి దశాబ్దాలుగా విశేష కృషి చేస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌ను గుర్తిస్తూ చెన్నై శ్రీకళా సుధా తెలుగు అసోసియేషన్ సేవా రత్న అవార్డుతో సత్కరించటం ముదావహమని బొండాడ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ బొండాడ రాఘవేంద్రరావు అన్నారు. ఎమ్మెల్యేను రాఘవేంద్రరావు బుధవారం అభినందించారు. మండలి వెంకట్రామ్, డాక్టర్ శేషగిరిరావు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌ను సత్కరిస్తున్న బొండాడ రాఘవేంద్రరావు

స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని రద్దుచేయాలి

● వామపక్షాల డిమాండ్

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 28: విద్యుత్ సంస్కరణల పేరుతో గత వైసీపీ ప్రభుత్వం అమలుచేయాలని చూసిన స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని కూటమి ప్రభుత్వం రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వైనరసింహారావు డిమాండ్ చేశారు. వామపక్షాల ఆధ్వర్యంలో బుధవారం విద్యుత్ అమరవీరులకు రేవతి సెంటర్‌లో సంస్మరణ సభ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో సీపీఐ నాయకుడు లింగం ఫిలిప్, సీపీఎం నాయకుడు బి.సుబ్రహ్మణ్యం, పోలినాయుడు, కొడాలి శర్మ తదితరులు మాట్లాడారు.





మచిలీపట్నం, చల్లపల్లిలో విద్యుత్ అమరవీరుల సంస్మరణ సభలో మాట్లాడుతున్న వామపక్షాల నాయకులు

ప్రజలపై భారాలు మోపేందుకే స్మార్ట్ మీటర్లు

చల్లపల్లి: స్థానిక ప్రధాన సెంటర్‌లో వామపక్షాల ఆధ్వర్యంలో విద్యుత్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నికల ముందు విద్యుత్ భారాలపై గత ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడిన టీడీపీ నేడు అధికారంలో ఉందని, తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి యద్దనపూడి మధు డిమాండ్ చేశారు. ప్రజలపై భారాలు మోపేందుకే స్మార్ట్ మీటర్లు అమరావతి వచ్చాయన్నారు. విద్యుత్ భారాలు, మీటర్లు, ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా అమరవీరుల స్ఫూర్తితో మరోపోరుకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. సీపీఎం జిల్లా నేత వాకా రామచంద్రరావు, సీఐటీయూ నేతలు మహమ్మద్ కరీముల్లా, వెనిగళ్ల వసంతరావు, గోళ్ల సాంబశివరావు, మాదాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యుత్ అమరవీరులకు నివాళి

గుడివాడ: విద్యుత్ అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడతామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.లక్ష్మణరావు అన్నారు. బుధవారం విద్యుత్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వారి చిత్రపటాలకు ఆయన నివాళులర్పించారు. విద్యుత్‌ను ప్రైవేటీకరించి, అదానీకి అప్పగించేందుకు స్మార్ట్ మీటర్లు సిద్ధంగా ఉన్నాయని, వాటిని పంపుసెట్లు, గృహాల్లోనూ బిగించబోతున్నారన్నారు. రాబోయే రోజుల్లో విద్యుత్ ప్రైవేటీకరణ, స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా పోరాటానికి సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఐద్వా పట్టణ కార్యదర్శి పి.రజిని, నాయకులు అరుణ, వీరమ్మ, లంకా సురేంద్ర పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 28: ర్యాగింగ్‌కు పాల్పడితే జైలుకు వెళ్లడం తప్పదని విద్యార్థులను బందరు డీఎస్పీ అబ్దుల్ సుభాన్ హెచ్చరించారు. కృష్ణా విశ్వ విద్యాలయంలో బుధవారం యాంటీ ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, మాదక ద్రవ్యాల నిర్మూలన, సోషల్ మీడియా, సైబర్ నేరాల పట్ల విద్యార్థులకు డీఎస్పీ అవగాహన కల్పించారు. విశ్వ విద్యాలయంలో సీనియర్లు, జూనియర్లు అనే తేడా లేకుండా అందరూ స్నేహంగా మెలగాలన్నారు. కళాశాలల్లో యాంటీ డ్రగ్స్ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ విజయకుమారి, అధ్యాపకులు, రూరల్ ఎస్‌ఐ సత్యనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ అబ్దుల్ సుభాన్

మత్తు పదార్థాల వినియోగంతో అనర్థాలు

గుడివాడ: మత్తు పదార్థాల వినియోగంతో అనేక అనర్థాలు కలుగుతాయని, యువత వాటికి దూరంగా ఉండాలని, సామాజిక మాధ్యమాల పట్ల అప్రమత్తంగా ఉండాలని టూటౌన్ సీఐ చిన్ని నాగప్రసాద్ సూచించారు. బుధవారం కేటీఆర్ కళాశాలలో గంజాయి, డ్రగ్స్ బారిన పడకుండా విద్యార్థులకు ఆయన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్రాఫిక్ నియమాలు, పోక్సో చట్టం, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సీసీఎస్ సీఐ ఇ.రమణమ్మ, ఎస్.ఐ పి.నాగరాజు, ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

గంజాయితో జీవితం నాశనమే

తోట్లవల్లూరు: గంజాయి, ఇతర డ్రగ్స్‌కు విద్యార్థులు అలవాటు పడొద్దని, వీటి బారిన పడితే జీవితమే నాశనమవుతుందని ఎస్సై ఎం.అర్జున రాజు తెలిపారు. గంజాయి తాగితే కలిగే అనర్థాలు, మైనార్టీ తీరకుండా డ్రైవింగ్ చేస్తే తీసుకునే చర్యలు, సైబర్ క్రైమ్ యాక్ట్‌పై వల్లూరుపాలెం జడ్పీ హైస్కూల్లో బుధవారం ఎస్సై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయిని స్వరాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న ఎస్టీయూ నాయకులు

ఉత్తమ ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌కు సత్కారం

గుడివాడ: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన ఎం.శ్రీనివాస్‌ను ఎస్టీయూ ఆధ్వర్యంలో బుధవారం ఎస్పీఎస్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో సత్కరించారు. ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి డి.చంద్రశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి డి.చంద్రశేఖర్, హెచ్‌ఎం రాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొవ్వ పీహెచ్‌సీ అభివృద్ధికి కృషి

● ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

కూచిపూడి, ఆగస్టు 28: మొవ్వ పీహెచ్‌సీని అప్‌గ్రేడ్ చేసి అన్ని విధాలుగా అభివృద్ధి పరుస్తామని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. బుధవారం పీహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై వైద్యాధికారి వేదరాజ్‌ను అడిగి వివరాలు సేకరించారు. మంత్రి సత్యకుమార్‌తో ఇప్పటికే వైద్యశాల అభివృద్ధిపై మాట్లాడానని ఎమ్మెల్యే తెలిపారు. అన్ని రకాల వైద్య పరికరాలు అందుబాటులో ఉంచుతామన్నారు. మొవ్వ పీహెచ్‌సీలో విష, వైరల్ జ్వరాలు, డయేరియా కేసులు ఉన్నాయని, ఒకటి, రెండు డెంగ్యూ కేసులు ఉంటే వాటిని వేరొక ఆస్పత్రికి రిఫర్ చేశామని వైద్యులు తెలిపారు. నాణ్యమైన వైద్యం అందించాలని వైద్యులకు ఎమ్మెల్యే సూచించారు. మండవ శ్రీకృష్ణ, మండవ రత్నగిరిరావు పాల్గొన్నారు.



మొవ్వ పీహెచ్‌సీలో రోగులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కుమార్ రాజా

అయ్యప్పస్వామి ఆలయ శంకుస్థాపన

కూచిపూడి: కోసూరులో విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో నిర్మిస్తున్న అయ్యప్పస్వామి ఆలయ శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పాల్గొన్నారు. కార్యక్రమంలో మురారి శ్రీనివాసరావు, దళపతిరాజు రామకృష్ణంరాజు, చిందా నాగేశ్వరరాజు, నరసరాజు, పంచాయతీ కార్యదర్శి ఎం.ఎస్.ఎన్.మూర్తి పాల్గొన్నారు.

ఎంపీ కేశినేని చిన్నిని కలిసిన కుమార్‌రాజా

పామర్రు: విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)ను విజయవాడలోని ఆయన నివాసంలో బుధవారం ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా మర్యాదపూర్వకంగా కలిశారు. పలు అంశాలపై వారు చర్చించుకున్నారు.



రావెళ్ల కృష్ణ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కుటుంబసభ్యులు, టీడీపీ నేతలు

ప్రజానాయకుడు రావెళ్ల కృష్ణ

చల్లపల్లి, ఆగస్టు 28: మరణించి రెండు దశాబ్దాలు దాటినా నేటికీ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి ఉన్న ప్రజానాయకుడు రావెళ్ల కృష్ణ అని టీడీపీ సీనియర్ నాయకుడు, తూర్పు కృష్ణా ప్రాజెక్టు కమిటీ మాజీ సభ్యుడు నిడమానూరి దిలీప్‌కుమార్ అన్నారు. టీడీపీ నేత రావెళ్ల కృష్ణ 23వ వర్థంతిని బుధవారం ఆర్కే కన్వెన్షన్‌లో, మంగళాపురంలో నిర్వహించారు. గ్రామంలోని కృష్ణ విగ్రహాలకు టీడీపీ నేతలు, కుటుంబ సభ్యులు నివాళులర్పించారు. రావెళ్ల కృష్ణ సేవాసమితి ద్వారా కుమారులు జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు ఆటల పరికరాల కిట్‌ను అందజేశారు. పదోతరగతిలో ప్రథమస్థానంలో నిలిచిన ఇద్దరు విద్యార్థినులకు సేవాసమితి తరఫున మూడు వేలు, ఇరిగేషన్ డీఈఈ రావెళ్ల రవికిరణ్ మరో మూడు వేలు అందజేశారు. మండలంలో ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందిన వారికి నగదు బహుమతులు అందించారు. చల్లపల్లి సీయోను వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. రావెళ్ల ఉదయ్ కుమార్, రావెళ్ల సుజాత, గోరిపర్తి సుబ్బారావు, కొల్లూరి పల్లవి, పేరం లక్ష్మి, ఎన్నారై గుంటుపల్లి నరేన్, కమలాకరరావు, రావెళ్ల విజయ్ పాల్గొన్నారు.

ప్రకృతి విపత్తుల్లో అవగాహనతో మెలగాలి

ఘంటసాల, ఆగస్టు 28: ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు అవగాహనతో మెలగాలని, అప్పుడే ప్రమాదాల బారి నుంచి ప్రజలను కాపాడవచ్చునని ఎన్‌డీఆర్ఎఫ్ 10వ బెటాలియన్ కమాండెంట్ వి.వి.ఎన్.ప్రసన్నకుమార్ అన్నారు. బుధవారం శ్రీకాకుళం పంచాయతీ కార్యాలయం వద్ద తుపాన్లు, వరదలు, ప్రమాదాలు, ప్రకృతి వైపరీత్యాలపై ఎన్డీఆర్ఎఫ్ బృందం అవగాహన కార్యక్రమం నిర్వహించింది. ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను టీమ్ కమాండర్ ఇన్‌స్పెక్టర్ పింటు నాంది వివరించారు. సీపీఆర్ చేయడం, రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు, భూకంపాలు, వరదలు వచ్చినప్పుడు ఎలా వ్యవహరించాలో రెస్క్యూ సిబ్బంది వివరించారు. డీటీ చిట్టిబాబు, రీ సర్వే డీటీ శ్రీనివాస్, మొవ్వ అగ్నిమాపక అధికారి కొణతం వెంకటేశ్వరరావు, సిబ్బంది ఏవీ పూర్ణచంద్రరావు, గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హాస్టళ్లకు ఇన్వర్టర్ల బహూకరణ

కోడూరు, ఆగస్టు 28: ఉల్లిపాలెం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు నాగభూషణం బుధవారం స్వతంత్రపురం ఎస్సీ బాలికల హాస్టల్, బీసీ బాలుర హాస్టల్‌కు పూర్వ విద్యార్థులు, మిత్రుల సహకారంతో రూ.38 వేల విలువైన ఇన్వర్టర్లు బహూకరించారు.

మోపిదేవి జడ్పీటీసీ సభ్యుడిపై ఎస్పీకి ఫిర్యాదు

మోపిదేవి, ఆగస్టు 28: ఆర్థిక లావాదేవీల వ్యవహారంలో తనను బెదిరించారని మోపిదేవి జడ్పీటీసీ సభ్యుడు మెడబలిమి మల్లికార్జునరావుపై స్థానిక ఆర్యవైశ్య వ్యాపారి పి.చంద్రమోహన్ ఎస్పీ ఆర్.గంగాధరరావుకు ఫిర్యాదు చేశారు. మండలంలోని కోసూరువారిపాలెం గ్రామానికి చెందిన ఇద్దరికి సంబంధించిన నగదు లావాదేవీల వ్యవహారంలో తనను జడ్పీటీసీ సభ్యుడు మల్లికార్జునరావు బెదిరించారని చంద్రమోహన్ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ డీకే బాలాజీ

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధే లక్ష్యం

● ప్రజలు భాగస్వాములవ్వాలి..కలెక్టర్ బాలాజీ పిలుపు

పామర్రు, ఆగస్టు 28: వికసిత్ ఆంధ్రప్రదేశ్ లక్ష్య సాధనకు జిల్లా ప్రజలంతా కలిసి రావాలని కలెక్టర్ డీకే బాలాజీ పిలుపునిచ్చారు. వికసిత్ ఆంధ్రప్రదేశ్-2047 విజన్ డాక్యుమెంట్ రూపకల్పనలో భాగంగా మార్కెట్‌యార్డు ఆవరణలో బుధవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సదస్సులో ఆయన మాట్లాడారు. రాబోయే ఐదేళ్లలో జిల్లాలో వివిధ రంగాల నుంచి వచ్చే దిగుబడుల ఆదాయ వృద్ధి రేటును 15శాతం పెంచడం ప్రభుత్వం ధ్యేయమన్నారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు అనుభవాలను సదస్సులో వివరించారు. కాల్వగట్ల ఆక్రమణలపై, అనధికార లేఔట్లపై చర్యలు తీసుకోవాలని మావులూరి కిరణ్‌రెడ్డి కలెక్టర్ దృష్టికి తెచ్చారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

నియోజకవర్గంలో పేదలకు కేటాయించిన గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని అధికారులను కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశించారు. పామర్రు డివిజన్‌లో గృహ నిర్మాణాలు ఆశించినస్థాయిలో ముందుకు సాగకపోవడంపై అధికారులపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. అలసత్వం ప్రదర్శించే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, సీపీవో జి.గణేష్, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, డీపీవో నాగేశ్వరనాయక్, పార్థసారథి, మార్క్‌ఫెడ్ డీఎం మురళీకిషోర్, సర్పంచ్ కె.కస్తూరి, వ్యవసాయ, మత్స్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

జాబ్ మేళా క్యాలెండర్ ఆవిష్కరణ

అవనిగడ్డ: స్కిల్ డెవలప్‌మెంట్ రాష్ట్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా శిక్షణ విభాగం, ఉపాధి శిక్షణ శాఖ ఆధ్వర్యంలో 2025 మార్చి వరకు జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహించే జాబ్‌మేళా తేదీలు, ప్రదేశాల వివరాలతో రూపొందించిన క్యాలెండర్‌ను కలెక్టర్ డీకే బాలాజీ బుధవారం ఆవిష్కరించారు. అవనిగడ్డ రెవెన్యూ సమావేశంలో నిర్వహించిన వికసిత్ ఆంధ్రప్రదేశ్ కార్యశాలలో కలెక్టర్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. నిరుద్యోగులు ఆసక్తి గల రంగాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ విభాగం ద్వారా శిక్షణ పొంది ఉపాధి పొందాలని కలెక్టర్ సూచించారు.

నేడు గుడివాడలో వికసిత్ ఏపీ

గుడివాడ: గుడివాడలో గురువారం సాయంత్రం నియోజకవర్గ స్థాయిలో కలెక్టర్ డీకే బాలాజీ ఆధ్వర్యంలో వికసిత్ ఏపీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, అన్ని శాఖల అధికారులు సమావేశానికి రావాలని ఎంపీడీవో ఎ.వెంకటరమణ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో వికసిత్ ఆంధ్రప్రదేశ్‌పై నిర్వహించిన ఒక్క రోజు శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. పశుసంవర్ధకశాఖ డెమోను ఆ శాఖ ఏడీఏ యు.హనుమంతరావు వివరించారు. వ్యవసాయ శాఖ, విద్య, వైద్యం, ఆర్‌డబ్ల్యూఎస్, వెలుగు శాఖలపై అధికారులు వివరించారు.

నందివాడ మండల కార్యాలయంలో..

నందివాడ: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో నాగేశ్వరరావు ఆధ్వర్యంలో వికసిత్ ఆంధ్రప్రదేశ్ -2047 కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా సీఎం చంద్రబాబు పనిచేస్తున్నారని ఎంపీడీవో వివరించారు. ఆర్థిక వనరులు పెంచుకోవడంపై అవగాహన కల్పించారు. డీటీ నాగమల్లిక, భానుప్రకాష్, రవికుమార్, శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాల పెంపునకు కృషి చేయండి

● ఉపాధ్యాయులకు డీఈవో తాహెరా సుల్తానా సూచన

మోపిదేవి, ఆగస్టు 28: పాఠశాలల్లో విద్యా ప్రమాణాల మరింత పెంచేలా ప్రతీ ఉపాధ్యాయుడు బాధ్యతగా పనిచేయాలని డీఈవో తాహెరా సుల్తానా సూచించారు. బుధవారం మోపిదేవి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో ఆమె సమావేశం నిర్వహించారు. హైస్కూల్ ప్లస్‌గా ఉన్న పాఠశాలల్లో కళాశాల ఉపాధ్యాయుల కొరత ఉందని డీఈవో దృష్టికి హెచ్‌ఎం జయంతి తీసుకొచ్చారు. పెదకళ్లేపల్లిలో ఈ విద్యాసంవత్సరం నుంచి ప్రారంభించిన బాలుర, బాలికల జూనియర్ కళాశాలలో ఉపాధ్యాయులు లేకపోవటంతో అడ్మిషన్లు రాలేదన్నారు. మండలంలోని ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల్లో ఉన్నత విద్యార్హతలు కలిగిన ఉపాధ్యాయుల వివరాలు సేకరించి అవసరమైన పాఠశాలలు, కళాశాలల్లో సర్దుబాటు చేయాలని ఎంఈవో విద్యాసాగర్‌కు డీఈవో సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఆయాలు, నైట్ వాచ్‌మెన్లకు ఈ నెలాఖరులోగా వేతనాలు చెల్లించేలా చూస్తామని డీఈవో తెలిపారు. మోపిదేవి హైస్కూల్‌లో ఖాళీగా ఉన్న రెండు వ్యాయామోపాధ్యాయుల పోస్టులను త్వరలో సర్దుబాటు చేస్తామని ఆమె హామీ ఇచ్చారు.



మోపిదేవి హైస్కూల్‌లో మాట్లాడుతున్న డీఈవో తాహెరా సుల్తానా

1న బందరులో 40 వేల మొక్కల పంపిణీ

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 28: మొక్కలు నాటి బందరును హరితవనంగా మారుద్దామని నగరవాసులకు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ పిలుపునిచ్చారు. బుధవారం చిన్నాపురం డాక్టర్ రాళ్లపల్లి వెంకట లక్ష్మణస్వామి ఆస్పత్రి వద్ద మొక్కల పంపిణీ పోస్టర్లను డాక్టర్ వెంకట లక్ష్మణస్వామి, గడ్డం రాజుతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పుట్టిన రోజును పురస్కరించుకుని 40 వేల మొక్కలను ఆదివారం హిందూ కళాశాల ఆవరణలో పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు. రక్తదాన శిబిరాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

గుడివాడలో రక్తదాన శిబిరం

గుడివాడ: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పుట్టినరోజును పురస్కరించుకుని సెప్టెంబరు 1వ తేదీన వెంకటేశ్వర ఫంక్షన్ హాల్‌లో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ తెలిపారు. బుధవారం జనసేన నియోజకవర్గ కార్యాలయంలో రక్తదాన శిబిరం కరపత్రాలను ఆయన విడుదల చేశారు. జనసేన పార్టీ అభిమానులు, కార్యకర్తలు, మెగా అభిమానులు శిబిరంలో పాల్గొని రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 28: క్రీడలతో శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసం కలుగుతుందని, విద్యార్థినులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి కలిగి ఉండాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ అన్నారు. క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మచిలీపట్నం పద్మావతి జూనియర్ కళాశాలలో విద్యార్థినులతో ఆయన ప్రతిజ్ఞ చేయించారు. బాలికల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గురువారం జాతీయక్రీడా దినోత్సవం సందర్భంగా మచిలీపట్నం, అవనిగడ్డలో కీడా దినోత్సవ కార్యక్రమంలో క్రీడాకారులకు బహుమతులు అందజేస్తారని తెలిపారు. బాలాజీ విద్యాలయంలో విద్యార్థులకు కబడ్డీ పోటీలు నిర్వహించారు. జిల్లా స్పోర్ట్స్ అధికారి ఝాన్సీ పాల్గొన్నారు.



పద్మావతి జూనియర్ కళాశాలలో విద్యార్థినులతో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న బండి రామకృష్ణ

బైక్‌ను ఢీకొన్న కారు..యువకుడి మృతి

● మరో యువకుడికి తీవ్రగాయాలు

గుడివాడ: బైక్‌ను కారు ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన బుధవారం గుడివాడ మండలం బొమ్ములూరులో జరిగింది. "ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేటకు చెందిన ఇద్దరు యువకులు స్పోర్ట్స్ బైక్‌పై మచిలీపట్నం వెళుతుండగా బొమ్ములూరు వినాయకస్వామి గుడి దాటాక ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. అక్కడికక్కడే పరసా వేణుసాయి మృతి చెందాడు. మరో యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం గుడివాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం." అని గుడివాడ తాలుకా పోలీసులు తెలిపారు.

జనసేన కార్యాలయం ప్రారంభం

కోడూరు, ఆగస్టు 28: నరసింహపురం రోడ్డులో జనసేన పార్టీ మండల అధ్యక్షులు మర్రే గంగయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తనయుడు మండలి వెంకట్రామ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కనగాల వెంకటేశ్వరరావు, యర్రంశెట్టి దామోదరరావు, లంకే భాస్కరరావు, కొండవీటి సునీత, కోట రాంబాబు, జరుగు ఆదినారాయణ, పూతబోయిన సీతారత్న సాయిబాబు, బడే భావన్నారాయణ, గుడిసేవ సూర్యనారాయణ, కాగిత రామారావు, పెద్ది భాస్కరరావు, పూతబోయిన సీతారత్నసాయిబాబు, ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.